మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

గురువారం THURSDAY 5-2-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 217 Issue: 217

05 ఫిబ్రవరి 2026 - గురువారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు మాఘ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:50 సూర్యాస్తమయం - సా. 6:09 తిథి చవితి రా. 12:260 వరకు తరువాత పంచమి సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం ఉత్తర ఫల్గుని(ఉత్తర) రా. 10:57 వరకు తరువాత హస్త యోగం సుకర్మ రా. 12:050 వరకు కరణం బవ మ. 12:14 వరకు బాలవ రా. 12:260 వరకు వర్జ్యం తె. 5:37 నుండి ఉ. 7:16 వరకు దుర్ముహూర్తం ఉ. 10:36 నుండి ఉ. 11:22 వరకు మ. 3:08 నుండి మ. 3:53 వరకు రాహుకాలం మ. 1:55 నుండి మ. 3:19 వరకు యమగండం ఉ. 6:50 నుండి ఉ. 8:15 వరకు గుళికకాలం ఉ. 9:40 నుండి ఉ. 11:05 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:14 నుండి ఉ. 6:02 వరకు అమృత ఘడియలు మ. 3:31 నుండి సా. 5:10 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:07 నుండి మ. 12:52 వరకు గమనిక: ౦౦ అనగా మరుసటి రోజున

Published from Jagitial www.evarthalu.com

# సంజయ్ పార్టీ మారలే! బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే



## కాంగ్రెస్ కండువా కప్పుకుంటే పార్టీ మారినట్లా?

### పార్టీ సమావేశానికి హాజరైతే షేక్ హ్యాండిచ్చినట్లా?.. అనర్హత పిటిషన్ కొట్టేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌పై దాఖలైన అనర్హత పిటిషన్‌ను తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కొట్టేశారు. దీంతో సంజయ్ కుమార్ కు ఊరట లభించినట్లయింది. ఇదిప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ నిర్ణయం అటు అధికార కాంగ్రెస్ పార్టీకి బలాన్నివ్వడమే కాకుండా, ఫిరాయింపుల చట్టంపై జరుగుతున్న సుదీర్ఘ చర్చకు కొత్త మలుపునిచ్చింది.

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఈవార్తలు): గత అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల నియోజకవర్గం నుండి భారత్ రాష్ట్ర సమితి అభ్యర్థిగా డాక్టర్ సంజయ్ కుమార్ విజయం సాధించారు. అయితే, రాష్ట్రంలో మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆయన బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ చర్యను సవాలు చేస్తూ బిఆర్ఎస్ శాసనసభాపక్షం తరపున మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. తమ పార్టీ గుర్తుపై గెలిచి మరో పార్టీలోకి వెళ్లడం రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ కింద ఉల్లంఘన అని, కాబట్టి సంజయ్‌పై - 2 వ పేజీలో...

### పార్టీకి నెలకు 5 వేలు కట్టిన.. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్

### కాంగ్రెస్ నేతలతో కలిసి మీడియా సమావేశం

పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తనకు క్లీన్‌చిట్ ఇవ్వడంపై ఎమ్మెల్యే సంజయ్ స్పందించారు.నేను ఇప్పటికీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేనని చెప్పుకొచ్చారు.తాను బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయలేదని అలాగని కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం తీసుకోలేదు అని తెలిపారు. తన జీతం నుండి నెలకు రూ.5 వేలు బీఆర్ఎస్ పార్టీకి చెల్లించిన అని జగిత్యాల ఎమ్మెల్యే బండి సంజయ్ కుమార్ వెల్లడించారు. 'నేను బీఆర్ఎస్ పార్టీ గుర్తు మీద గెలిచిన...ఇప్పుడు కూడా నేను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే' అని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు.

జగిత్యాల, ఫిబ్రవరి 4 (ఈవార్తలు): ఎమ్మెల్యే సంజయ్‌పై అనర్హత పిటిషన్‌ను స్పీకర్ గడ్డం ప్రసాద్ బుధవారం కొట్టివేశారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ ఫిరాయింపు అంశంపై వివరణ ఇచ్చారు. తాను బీఆర్ఎస్ పార్టీని వీడలేదు అని చెప్పుకొచ్చారు. జగిత్యాల నియోజకవర్గం అభివృద్ధి కోసమే తాను సీఎం రేవంత్ రెడ్డిని కలిసినట్లు చెప్పుకొచ్చారు. అంతే తప్ప తాను పార్టీ మారలేదని అన్నారు. తాను కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఎక్కడా ఆధారాలు లేవు - 2 వ పేజీలో...



## సివిల్స్ నోటిఫికేషన్ రిలీజ్

న్యూఢిల్లీ: లక్షల మంది అభ్యర్థులు ఎదురుచూస్తున్న యూపీఎస్సీ సివిల్స్ పరీక్ష 2026కు నోటిఫికేషన్ విడుదలైంది. అఖిల భారత సర్వీసుల్లో 933 పోస్టుల భర్తీ కోసం సివిల్ సర్వీస్ ఎగ్జామినేషన్ (సీఎస్ఈ) 2026 పరీక్షకు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) బుధవారం రాత్రి నోటిఫికేషన్ విడుదల -2 వ పేజీలో...

# ఎవరికిరా జాతిపిత?



### నీ జాతికి నువ్వు పిత కావొచ్చు.. మాకు కాదు

### పదేళ్ల అధికారంలో రాష్ట్రాన్ని దోచుకున్నావు

### కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి అసభ్యకర వ్యాఖ్యలు

'భార్యాభర్తలు మాట్లాడుకుంటే దొంగచాటుగా విన్న సన్నాసివి, నువ్వెలా జాతిపిత అవుతావు?' అని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి అసభ్యకర వ్యాఖ్యలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసును ఉద్దేశించి ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడలో బుధవారం జరిగిన 'ప్రజా పాలన ప్రగతిబాట' భారీ బహిరంగ సభలో ప్రసంగించారు.

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఈవార్తలు): కేసీఆర్ కుటుంబంపై, బీఆర్ఎస్ నేతలపై నిప్పులు చెరిగారు. కొంతమంది 'జాతిపిత'ను విచారిస్తారా అని అడుగుతున్నారని, అసలు "ఎవరికిరా నువ్వు జాతిపిత? నీ జాతికి నువ్వు పిత కావొచ్చు.. మాకు కాదు" అని రేవంత్ రెడ్డి అన్నారు. "ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ మొత్తం కనుమరుగైనా తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన సోనియమ్మ తెలంగాణ తల్లి అవుతుంది. తెలంగాణ కోసం సర్వం త్యాగం చేసిన ప్రొఫెసర్ జయశంకర్ జాతిపిత అవుతాడు. లు.., సన్నాసి, దొంగ అయిన నువ్వెలా జాతిపిత అవుతావు?" అంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి తీవ్ర పదజాలంతో విమర్శించారు. ఫోన్ తరువాయి 2 వ పేజీలో...



# రేవంత్ తోక వంకర!

### పాలన చేతగాక విషం

### సీఎంది మురికి భాష

### అతడి స్థానం మురికి కాలువే

### కనకపు సింహాసనంపై శునకం

### కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు

మిర్యాలగూడ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ పార్టీ భగ్గుమంది. కేసీఆర్‌ను ఏకవచనంతో సంభోదించడడంపై గులాబీ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో స్పందించారు. హార్వర్డ్ స్కూల్‌లో 500 రోజులు కోర్సులు చేసినా సంస్కారం నేర్చుకోకపోతే కుక్క తోక ఎప్పటికీ వంకరే అని విమర్శించారు.

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఈవార్తలు): రేవంత్ రెడ్డి స్థానం మురికి కాలువే అని తెలిపారు. తెలంగాణ జాతిపిత కేసీఆర్‌పై మురికిమాటలు మాట్లాడే రేవంత్ రెడ్డి పాలన చేతకాని వాడే విషం చిమ్ముతున్నాడని కేటీఆర్ మండిపడ్డారు. 'మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో రేవంత్ నోట్లో నుంచి పాలసీలు రావు. పథకాలు వినిపించవు. వచ్చేది తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు



| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,944 |
| వెండి (గ్రాము): | రూ.320 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,614 |

# సంస్కృతిపై రేవంత్ దాడి

### ముస్లింల ఓట్ల కోసం బుజ్జగింపు రాజకీయాలు

### రెండేళ్లలో అనేక హిందూ ఆలయాలపై దాడులు


### ఊరుకోం.. ప్రాణ త్యాగానికైనా వెనుకాడబోం

### విజయ సంకల్ప సభలో బీజేపీ చీఫ్ నితిన్ నబిన్

తెలంగాణలో రాజకీయాలు చాలా దయనీయంగా ఉన్నాయని.. మనదేశ సంస్కృతి సంప్రదాయాలపై సీఎం రేవంత్ రెడ్డి దాడి చేస్తున్నారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సిన్హా విమర్శించారు. బుధవారం నాడు మహబూబ్ నగర్‌లోని ఎంవీఎస్ కాలేజ్ గ్రౌండ్‌లో బీజేపీ విజయ సంకల్ప సమ్మేళనం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రసంగించిన నితిన్ నబీన్.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టారు.



మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 4 (ఈవార్తలు): కాంగ్రెస్ పార్టీ అంటే ముస్లింల పార్టీ అని స్వయంగా ముఖ్యమంత్రే ప్రకటించారని గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన బడ్జెట్ నిధులను మైనార్టీలకు బదలాయించారని ఆరోపించారు. రాష్ట్రంలో 77 వేల ఎకరాల భూమి వక్ఫ్ బోర్డుకు ఉందని గుర్తు చేశారు. ముస్లింల ఓట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో అనేక హిందూ దేవాలయాలను కూల్చారంటూ మండిపడ్డారు నితిన్ నబీన్. ఆలయాలపై రాజకీయం చేస్తే.. బీజేపీ చూస్తూ ఊరుకోదన్నారు. అవసరమైతే తాము ప్రాణ త్యాగానికైనా సిద్ధమని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన విధానాలు మార్చుకోకపోతే.. ఎక్కువ రోజులు ఉండబోదంటూ హెచ్చరించారు. ప్రధాని మోదీ.. మహిళలను లక్షాధికారులను చేయాలని తరువాయి 2 వ పేజీలో...



# సుఖం.. దుఃఖం

### తెలుగు రాష్ట్రాల్లో మళ్లీ ఎయిడ్స్ పంజా

### గత ఐదేళ్లలో దాదాపు 50 వేల మరణాలు

### ఐటీ రంగంలో విస్తరిస్తున్న హెచ్ఐవీ

ఒకప్పుడు ఊరూరా హోరెత్తిన ఎయిడ్స్ అవగాహన ప్రచారాలు ఇప్పుడు నెమ్మదించాయా? అంటే అవునంటున్నాయి తాజా గణాంకాలు. గత ఐదేళ్లలో దేశవ్యాప్తంగా నమోదైన హెచ్ఐవీ మరణాల్లో 25 శాతం ఒక్క తెలుగు రాష్ట్రాల్లోనే ఉండటం అత్యంత బాధాకరం. వైద్యం అందుబాటులో ఉన్నా, మందులు ఉచితంగా ఇస్తున్నా మరణాల రేటు తగ్గకపోవడం మన వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతోంది.

తాజా నివేదికల ప్రకారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కలిపి దాదాపు 4 లక్షల మందికి పైగా బాధితులు ఉన్నట్లు అంచనా. గత ఐదేళ్లలో రెండు రాష్ట్రాల్లో కలిపి దాదాపు 44,140 మంది ప్రాణాలు కోల్పోయారు. ఏపీలో 32,642 మంది చనిపోగా... తెలంగాణలో 11,498 మంది మృతి చెందారు. అంటే తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



చెత్త నుంచి విద్యుత్తును ఉత్పత్తి చేస్తూ స్వీడన్ కొత్త చరిత్ర సృష్టిస్తోంది. తమ దేశంలో ఉన్న చెత్త సరిపోక, పక్క దేశాలైన నార్వే, యూకే నుంచి చెత్తను సేకరించి, దాన్నుంచి విద్యుత్తును ఉత్పత్తి చేస్తోంది.



# మహిళా న్యాయవాది దారుణ హత్య

### ఆస్తి గొడవలు.. సోదరుడే హంతకుడు

రంగారెడ్డి జిల్లాలో దారుణం జరిగింది. మొయినాబాద్ మండలంలోని కేతిరెడ్డిపల్లిలో పొలం వద్ద మహిళా న్యాయవాది స్వప్న హత్యకు గురయ్యారు. సోదరుడే ఆమె మెడపై కత్తితో దాడి చేసి హత్య చేశాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆమెను హత్య చేసినట్లు తెలుస్తోంది.

రంగారెడ్డి, ఫిబ్రవరి 4 (ఈవార్తలు): స్థానికులు సమాచారం ఇవ్వడంతో మొయినాబాద్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. స్వప్న చేవెళ్ల కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఆమె కుటుంబంలో ఆస్తి గొడవలు ఉన్నాయని చెబుతున్నారు. ఈ క్రమంలో బుధవారం పొలం వద్ద పంచాయితీ జరుగుతుండగా సోదరుడు స్వప్నను హతమార్చాడు. మృతదేహాన్ని తరువాయి 2 వ పేజీలో...




# విద్యుత్తు కనెక్షన్లకు ఫిక్స్‌డ్ చార్జీలు

### నేటి నుంచి కొత్త కనెక్షన్ల జారీలో మార్పులు

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఈవార్తలు): విద్యుత్తు కనెక్షన్లపై ఇక నుంచి ఫిక్స్‌డ్ చార్జీలు వసూలు చేయనున్నారు. గతంలో స్తంభాలు, లైన్స్ కోసం వినియోగదారుల నుంచి దూరాన్ని బట్టి ఒక్కో రీతిలో డబ్బు వసూలు చేసేవారు. కానీ, ఇక నుంచి ఫిక్స్‌డ్ ఛార్జీలు వసూలు చేయబోతున్నారు. 1 కిలో వాట్ కనెక్షన్‌కు రూ.500 కడితే సరిపోతుంది. 1 కిలో వాట్ నుంచి 5 కిలో వాట్ వరకు రూ.3,500 వరకు తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు
5.2.2026

మేషం: ఆర్థిక పరిస్థితి మందగిస్తుంది. ఇంటాబయట మానసిక సమస్యలు పెరుగుతాయి. వృత్తి, వ్యాపారాలలో స్వంత ఆలోచనలు కలిసిరావు. ఆరోగ్య విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. ఉద్యోగస్తులకు పనిభారం పెరుగుతుంది. నిరుద్యోగ ప్రయత్నాలు నిరుత్సాహపరుస్తాయి.

వృషభం: దూరపు బంధువుల నుంచి శుభవార్తలు అందుతాయి. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. చేపట్టిన పనులు సకాలంలో పూర్తవుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు సఫలమవుతాయి. వృత్తి వ్యాపారాలు విస్తరిస్తాయి. ఉద్యోగమున పదోన్నతులు పెరుగుతాయి. ఋణ ఒత్తిడి నుండి బయటపడతారు.

మిధునం: మిత్రులతో మాటపట్టింపులు కలుగుతాయి. అనుకున్న పనులు ముందుకు సాగక నిరాశ పెరుగుతుంది. ఇంటాబయట చికాకులు పెరుగుతాయి. మానసిక అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగాలలో శ్రమకు తగిన గుర్తింపు లభించదు.

కర్కాటకం: సన్నిహితుల నుండి ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. వృత్తి ఉద్యోగాల్లో మీ ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది. స్థిరాస్తి కొనుగోలు చేస్తారు. వృత్తి వ్యాపారాల్లో ఆశించిన పురోగతి లభిస్తుంది. విద్యార్థుల ప్రయత్నాలు ఫలిస్తాయి.

సింహం: చిన్ననాటి మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. బంధు మిత్రుల సహాయ సహకారాలతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. వ్యాపారాలలో నూతన ఆలోచనలు అమలు పరుస్తారు. ఉద్యోగస్తులకు పని ఒత్తిడి నుండి ఉపశమనం కలుగుతుంది. ఆర్థిక వాతావరణం ఆశాజనకంగా ఉంటుంది.

కన్య: ఆదాయానికి మించిన ఖర్చులు పెరుగుతాయి. బంధుమిత్రులతో ఊహించని కలహాలు కలుగుతాయి. చేపట్టిన వ్యవహారాలలో అవరోధాలుంటాయి. తల్లిదండ్రుల ఆరోగ్య విషయంలో కొంత జాగ్రత్త వహించాలి. వ్యాపారాలు అంతంతమాత్రంగా సాగుతాయి. ఉద్యోగ వాతావరణం చికాకుగా ఉంటుంది.

తుల: ముఖ్యమైన వ్యవహారాలలో ఆలోచనలలో నిలకడ లోపిస్తుంది. వృత్తి వ్యాపారాలలో వివాదాలు కలుగుతాయి. ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. నిరుద్యోగులకు ప్రయత్నాలు ఫలించవు. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు ఉంటాయి.

వృశ్చికం: కుటుంబ సభ్యులతో పుణ్యక్షేత్ర దర్శనం చేసుకుంటారు. సమాజంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. చేపట్టిన వ్యవహారాలు సజావుగా సాగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు సానుకూలంగా సాగుతాయి. వ్యాపారాలలో కీలక నిర్ణయాలు అమలుచేస్తారు. వృత్తి ఉద్యోగాలు అనుకూలిస్తాయి.

ధనస్సు: మానసిక ప్రశాంతత కలుగుతుంది. చేపట్టిన వ్యవహారాలు విజయవంతంగా పూర్తి అవుతాయి. ఆలోచనలు ఆచరణలో పెడతారు. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. వృత్తి వ్యాపారాల్లో ఆశించిన లాభాలు అందుకుంటారు. నిరుద్యోగులకు అధికారులు అనుగ్రహంతో ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

మకరం: ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొంటారు. ప్రయాణాలలో అప్రమత్తంగా వ్యవహరించాలి. బంధువర్గం వారితో విభేదాలు కలుగుతాయి. వ్యాపార ఉద్యోగాలలో కొంత గందరగోళ పరిస్థితులు ఉంటాయి. అనుకున్న సమయానికి డబ్బు చేతికి అందక ఇబ్బంది కలుగుతుంది.

కుంభం: చేపట్టిన పనుల్లో ఆటంకాలు ఉంటాయి. మిత్రులతో స్వల్ప వివాదాలు కలుగుతాయి. ఖర్చుల విషయంలో ఆలోచించి వ్యవహరించడం మంచిది. ఆకస్మిక ప్రయాణాలు చేస్తారు. వ్యాపారాలలో తీసుకున్న నిర్ణయాలు కలిసిరావు. వృత్తి ఉద్యోగాలు మందకొడిగా సాగుతాయి. ఋణ ఒత్తిడి పెరుగుతుంది.

మీనం: పాత మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. వృత్తి వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి.సమాజంలో ప్రముఖుల నుండి విశేషమైన ఆదరణ లభిస్తుంది. చేపట్టిన పనులు వేగవంతంగా పూర్తి చేస్తారు. ఉద్యోగాలలో జీతభత్యాల విషయంలో శుభవార్తలు అందుతాయి.

# ఎవరికిరా జాతిపిత?

మొదటి పేజీ తరువాయి

ట్యాపింగ్ అంశంపై మాట్లాడుతూ.. "అన్నం తినేవాళ్లు ఎవరైనా భార్యాభర్తలు మాట్లాడుకుంటే వింటారా? సిగ్గుతో తలదించుకోవాలి. నిజానికి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ముఖాలకు ముసుగులు తొడిగి పోలీసులు విచారణకు తీసుకురావాల్సింది" అని వ్యాఖ్యానించారు. తాము జాతిపిత అయితే కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్, కేటీఆర్ జన్‌వాడ ఫామ్‌హౌస్, హరీశ్‌రావు మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లతో పాటు వేల కోట్ల ఆస్తులను తెలంగాణ ప్రజలకు రాసిస్తారా అని సవాల్ విసిరారు. తెలంగాణ ఉద్యమకారుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మకు కనీసం చిన్న పదవి కూడా ఇవ్వలేదని ఆరోపించారు. సభకు ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిర్యాలగూడలో రూ.200 కోట్లతో నిర్మించ తలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావును 'నమ్మకద్రోహి', 'నక్క జిత్తుల వ్యక్తి' అని అభివర్ణించారు. "జానారెడ్డి చెప్పులు, నీళ్లసీసాలు మోసిన భాస్కర్‌రావు, ఎమ్మెల్యేగా గెలిచాక ఆత్మగౌరవాన్ని ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ పాదాల దగ్గర పెట్టాడు. అలాంటి వ్యక్తికి మళ్లీ ఓటేస్తారా? గంగిరెద్దుల్లా ఓట్లు అడగడానికి వస్తే కర్రు కాల్చి వాత పెట్టండి" అని ప్రజలకు పిలుపునిచ్చారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి మున్సిపల్ ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలని ప్రజలను కోరారు. "పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు. మేము లక్షలాది కార్డులిచ్చి సన్న బియ్యం అందిస్తున్నాం. ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతులకు ఎకరానికి రూ.6 వేల రైతు భరోసా, రూ.500 బోనస్‌తో పాటు రుణమాఫీ చేశాం. 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం" అని ప్రభుత్వ విజయాలను వివరించారు. ఓటు వేసే ముందు ఈ పథకాలన్నింటినీ గుర్తు చేసుకోవాలని కోరారు. మున్సిపల్ శాఖ తన వద్దే ఉందని, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే పట్టణాలను అద్దంలా తీర్చిదిద్దే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపీ రఘువీర్ రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.



# సంజయ్ పార్టీ మారలే!

మొదటి పేజీ తరువాయి

అనర్హత వేటు వేయాలని జగదీశ్ రెడ్డి తన పిటిషన్‌లో కోరారు. సుదీర్ఘ పరిశీలన అనంతరం స్పీకర్ ప్రసాద్ కుమార్ ఈ పిటిషన్‌ను కొట్టివేస్తూ కీలక తీర్పునిచ్చారు. దీనికి ఆయన ప్రధానంగా రెండు కారణాలను పేర్కొన్నట్లు తెలుస్తోంది. సంజయ్ కుమార్ పార్టీ మారారని నిరూపించడానికి పిటిషనర్ సమర్పించిన ఆధారాలు సరిపోవని స్పీకర్ అభిప్రాయపడ్డారు. కేవలం ఒక సమావేశంలో పాల్గొన్నంత మాత్రాన లేదా కండువా కప్పుకున్నంత మాత్రాన అది సాంకేతికంగా పార్టీ మారినట్లు పరిగణించలేమని ఆయన తీర్పులో పేర్కొన్నారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి, అధికారికంగా మరో పార్టీలో చేరినట్లు పక్కా ఆధారాలు ఉండాలని స్పీకర్ కార్యాలయం స్పష్టం చేసింది. ఈ తీర్పు కేవలం ఒక ఎమ్మెల్యే వ్యక్తిగత గెలుపు మాత్రమే కాదు, దీని వెనుక లోతైన రాజకీయ కోణాలు ఉన్నాయి. ఇప్పటికే పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. సంజయ్ విషయంలో వెలువడిన ఈ తీర్పు మిగిలిన ఎమ్మెల్యేలకు ఒక రక్షణ కవచంలా మారే అవకాశం ఉంది. పార్టీని వీడిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయించడం ద్వారా ఉపఎన్నికలకు వెళ్లాలని లేదా కనీసం ఒత్తిడి పెంచాలని భావిస్తున్న బిఆర్ఎస్‌కు ఇది ఎదురుదెబ్బే. గతంలోనే హైకోర్టు ఫిరాయింపుల పిటిషన్లపై నిర్ణీత కాలపరిమితిలో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ కార్యాలయాన్ని ఆదేశించింది. ఇప్పుడు స్పీకర్ పిటిషన్‌ను కొట్టేయడంతో, బీఆర్ఎస్ నేతలు మళ్లీ న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం ఉంది.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే

మొదటి పేజీ తరువాయి

అని...కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తాను ఎప్పుడూ చెప్పలేదు అని అన్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ కూడా తాను ఆ పార్టీ చేరినట్లు ఎక్కడా ఎవరూ చెప్పలేదు అని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తెలిపారు. జగిత్యాల నియోజకవర్గం అభివృద్ధి కోసం తాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసినట్లు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తెలిపారు. అయితే ఆ సమయంలో సీఎం రేవంత్ రెడ్డి తనకు శాలువా కప్పారని గుర్తు చేశారు. అంతే తప్ప తాను ప్రత్యేకంగా కాంగ్రెస్ పార్టీలో చేరడానికి వెళ్లలేదని చెప్పుకొచ్చారు.కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పని చేస్తామని చెప్పాం తప్ప పార్టీలో చేరినట్లు ఎక్కడా తాను పేర్కొనలేదన...అలాగని సీఎం రేవంత్ రెడ్డి కూడా చెప్పలేదు అని చెప్పుకొచ్చారు. కానీ ఆధారాలు లేకుండా మీడియా అసత్య ప్రచారం చేసిందని మండిపడ్డారు. అంతేకాదు తాను కాంగ్రెస్ పార్టీలో చేరానని భావించి బీఆర్ఎస్ వాళ్లు తన ఆసుపత్రి వద్ద రచ్చరచ్చ చేశారని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో తనకు క్లీన్ చిట్ ఇవ్వడంపై ఎమ్మెల్యే సంజయ్ స్పందించారు. తాను గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచానని... ఇప్పటికీ అదే పార్టీకి చెందిన ఎమ్మెల్యేనని వెల్లడించారు.తాను బీజేపీకి రాజీనామా చేయలేదని అలాగని కాంగ్రెస్ పార్టీలో సభ్యత్వం తీసుకోలేదు అని స్పష్టం చేశారు. ఇకపోతే తన జీతం నుండి నెలకు రూ.5 వేలు బీఆర్ఎస్ పార్టీకి ఇప్పటికీ కట్ అయ్యాయని జగిత్యాల ఎమ్మెల్యే బండి సంజయ్ కుమార్ వెల్లడించారు. అంతేకాదు తాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే అని అఫిడవిట్ కూడా ఇచ్చానని...జగిత్యాల అభివృద్ధి కోసం తాను ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నానని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు.



# సంస్కృతిపై రేవంత్ దాడి

మొదటి పేజీ తరువాయి

చూస్తే.. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మహిళలను పూర్తిగా మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు అధికమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న అన్యాయాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలని కార్యకర్తలకు నితిన్ నబీన్ సూచించారు.

### రేవంత్ మాటల కోటలు: కిషన్ రెడ్డి

అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని.. ఒక్క ఉచిత బస్సు ప్రయాణం తప్ప అని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పాలనలోనే కాదు.. బీఆర్ఎస్ పాలనలో సైతం పాలమూరుకు అన్యాయం జరిగిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటుతాయని.. చేతలు మాత్రం గడప కూడా దాటవని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో అవినీతి జరిగిందని చెప్పిన రేవంత్ రెడ్డి ఏ ఒక్కరి మీద చర్య తీసుకున్నారో చెప్పాలంటూ డిమాండ్ చేశారు. కేసీఆర్, రాహుల్ గాంధీ మధ్య ఒప్పందం కుదిరిందని కేంద్రమంత్రి ఆరోపించారు. అందుకే చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. అందరి ఫోన్లు ట్యాపింగ్ చేసి పౌర హక్కులు కాలరాసిందంటూ బీఆర్ఎస్ పార్టీపై నిప్పులు చెరిగారు. బీజేపీ కార్యాలయంలో క్లర్క్ ఫోన్ సైతం ట్యాపింగ్ చేశారంటూ విమర్శించారు. సిట్ నోటీసులు టీవీ సీరియల్‌ను తలపిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి ఆశీర్వదించాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తద్వారా అభివృద్ధి చేసి చూపిస్తామని హామీ ఇచ్చారు.

### బీజేపీ అంటే వణుకు: రాంచందర్ రావు

తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీకి రాజకీయ దురహంకారం పెరిగిందని రాష్ట్ర బీజేపీ చీఫ్ ఎన్ రాంచందర్ రావు మండిపడ్డారు. బీజేపీని చూసి కాంగ్రెస్, బీఆర్ఎస్ భయపడుతున్నాయన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లోపించాయని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే అభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. కానీ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు గెలిస్తే మాత్రం ట్యాక్స్‌లు పె రుగుతాయని అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలవాలంటే మాత్రం.. ఈ మున్సిపల్ ఎన్నికల్లో గెలిచి తీరాలని కేడర్‌కు సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి.. బీజేపీ జెండాను ఎగురవేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.



# రేవంత్ తోక

మొదటి పేజీ తరువాయి

ఒక్కటే మురికి భాష. హార్వర్డ్‌లో 5 రోజులు కాదు.. 500 రోజులు కోర్సులు చేసినా సంస్కారం నేర్చుకోకపోతే కుక్కతోక ఎప్పటికీ వంకరే' అని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. 'తెలంగాణ కోసం ప్రాణాలు పెట్టి.. ఉద్యమాల్ని నడిపి.. రాష్ట్రాన్ని సాధించి.. తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా బంగారు తెలంగాణకు బాటలు వేసిన కేసీఆర్‌పై మురికిమాటలు మాట్లాడే నీ స్థానం మురికి కాలువే' అని మండిపడ్డారు. 'పాలనలో చేతకాని వాడే ప్రచారంలో విషం చిమ్ముతాడు. అది అహంకార లక్షణం కాదు. నీ పూర్తి అసమర్థతకు గుర్తు' అని ధ్వజమెత్తారు. 'చరిత్రను సృష్టించిన నాయకుడిని మాటలతో తక్కువ చేయలేరు. మురికి భాష మాట్లాడేవాడు తన మానసిక దరిద్రతనే ప్రజల ముందు బహిర్గతం చేస్తాడు' తెలిపారు. 'కనకపు సింహాసనంపై శునకాన్ని కూర్చోబెడితే అది రాజవదు. అది సింహాసనానికే అవమానం. రాష్ట్రాన్ని సాధించినవాళ్లపై, రాష్ట్రాన్ని దారిలో పెట్టినవాళ్లపై నోరు విప్పే నైతిక హక్కు రేవంత్ రెడ్డికి లేదు. కేసీఆర్ చరిత్రను నీ మాటలు మసకబార్చలేవని కానీ నీ స్థాయిని మాత్రం. నీ మాటలే తెలంగాణ ప్రజలకు రోజురోజుకీ మరింత స్పష్టంగా చూపిస్తున్నాయి' అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

## సివిల్స్ నోటిఫికేషన్ రిలీజ్

మొదటి పేజీ తరువాయి

చేసింది. యూపీఎస్సీ సీఎస్ఈ 2026 పరీక్షకు ఫిబ్రవరి 24వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. ప్రిలిమినరీ పరీక్ష మే 24న, మెయిన్స్ పరీక్ష ఆగస్టు 21 నుంచి జరుగుతాయి. ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌లో 80 పోస్టుల భర్తీకి యూపీఎస్సీ విడిగా నోటిఫికేషన్ విడుదల చేసింది.

# సుఖం.. దుఃఖం

మొదటి పేజీ తరువాయి

దేశంలో చనిపోతున్న ప్రతి నలుగురు బాధితుల్లో ఒకరు మన తెలుగు వారే. విస్మయకరమైన విషయం ఏంటంటే, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, విద్యావంతులైన యువతలో ఈ కేసులు పెరగడం. కేవలం అజ్ఞానం వల్లే కాదు, మారుతున్న జీవనశైలి, మాదకద్రవ్యాల ప్రభావం కూడా దీనికి ప్రధాన కారణమవుతున్నాయి. మహారాష్ట్ర తర్వాత దేశంలోనే అత్యధిక కేసులు ఉన్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలవడం గమనార్హం. 90వ దశకంలో ఉన్న భయం, అప్రమత్తత ఇప్పుడు యువతలో కనిపించడం లేదు. "మందులు ఉన్నాయి కదా" అనే ధీమా అసురక్షిత అలవాట్లకు దారితీస్తోంది. ఇంజెక్షన్ల ద్వారా డ్రగ్స్ తీసుకునే వారి సంఖ్య పెరగడం వైరస్ వ్యాప్తికి కొత్త మార్గంగా మారింది. ఇప్పటికీ 'పాజిటివ్' అని తెలిస్తే సమాజం చూసే చూపు మారుతుందనే భయంతో చాలామంది పరీక్షలు చేయించుకోవడానికి ముందుకు రావడం లేదు. ఇది తెలియకుండానే వైరస్‌ను ఇతరులకు వ్యాప్తి చేసేలా చేస్తోంది. ప్రభుత్వాలు కేవలం ఏఆర్టీ కేంద్రాల ద్వారా మందులు పంపిణీ చేస్తే సరిపోదు. 'ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దన్ క్యూర్' అన్న సూత్రాన్ని మళ్ళీ బలంగా ప్రచారం చేయాలి. గర్భిణులకు, యువతకు క్షేత్రస్థాయిలో పరీక్షలు తప్పనిసరి చేయాలి. కార్పొరేట్ కంపెనీల్లో హెల్త్ క్యాంప్‌లు నిర్వహించి, మారుతున్న జీవనశైలి ప్రమాదాలను వివరించాలి. హెచ్ఐవీ బాధితులు సాధారణ జీవితం గడపవచ్చని, వారిని గౌరవించాలని ప్రజల్లో చైతన్యం తేవాలి. 2030 నాటికి 'ఎయిడ్స్ రహిత సమాజం'గా భారత్‌ను మార్చాలనే లక్ష్యం నెరవేరాలంటే తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక కార్యాచరణ అవసరం.

### ఐటీ కారిడార్‌లో హెచ్ఐవీ నీడలు

చదువుకున్న వారు, ప్రపంచంపై అవగాహన ఉన్నవారు ఉండే ఐటీ రంగంలో ఈ మహమ్మారి విస్తరించడం ఒక వైరుధ్యం. కేవలం అజ్ఞానం వల్ల కాకుండా, అతి విశ్వాసం, మారుతున్న సంస్కృతి వల్ల ఈ సమస్య తీవ్రమవుతోంది. విదేశీ సంస్కృతి ప్రభావంతో మారుతున్న డేటింగ్ పద్ధతులు, అపరిచితులతో అసురక్షిత శృంగారానికి దారితీస్తున్నాయి. సామాజిక మాధ్యమాలు, డేటింగ్ యాప్‌ల వాడకం పెరగడం వల్ల భాగస్వాములను సులభంగా మార్చే ధోరణి పెరిగింది. వీకెండ్ పార్టీల్లో రిక్రియేషనల్ డ్రగ్స్ వాడకం ఒక ఫ్యాషన్‌గా మారింది. మత్తులో ఉన్నప్పుడు విచక్షణ కోల్పోయి రక్షణ లేని సంబంధాలు పెట్టుకోవడం వైరస్ వ్యాప్తికి ప్రధాన కారణమవుతోంది. కుటుంబాలకు దూరంగా ఉండటం, అధిక పని ఒత్తిడి నుంచి ఉపశమనం కోసం తాత్కాలిక సుఖాల వైపు మళ్లడం యువతను ప్రమాదంలోకి నెడుతోంది. ఐటీ ఉద్యోగుల్లో చాలామందికి హెచ్ఐవీ గురించి ప్రాథమిక అవగాహన ఉంటుంది, కానీ ఆ జ్ఞానం ప్రవర్తనలో మార్పు తీసుకురావడం లేదు. కంపెనీలు కేవలం వర్క్ టార్గెట్స్ గురించి కాకుండా, ఉద్యోగుల శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక వర్క్‌షాప్‌లు నిర్వహించాలి. ఐటీ పార్కుల్లోనే మొబైల్ టెస్టింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి, గోప్యంగా పరీక్షలు చేసుకునే వెసులుబాటు కల్పించాలి.

## విద్యుత్తు కనెక్షన్లకు ఫిక్స్‌డ్ చార్జీలు

మొదటి పేజీ తరువాయి

చార్జ్ చేస్తారు. ఇక నుంచి మెట్రో నగరాల్లో వినయోగదారుడు దరఖాస్తు చేసుకున్న 3 రోజుల్లోనే కనెక్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. అదేవిధంగా మున్సిపాలిటీల్లో గరిష్టంగా 7 రోజులు, గ్రామీణ ప్రాతాల్లో దరఖాస్తు చేసిన తర్వాత గరిష్టంగా 15 రోజుల్లో కొత్త కనెక్షన్ ఇవ్వాలి. కొండ ప్రాంతాలు లేదా భౌగోళిక ఇబ్బందులు ఉన్న చోట మాత్రం 30 రోజుల గడువు పెట్టారు. స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు వంటివి ఏర్పాటు చేయాల్సి వస్తే కేంద్ర విద్యుత్ శాఖ నిబంధనల మేరకు గరిష్టంగా 90 రోజుల్లోగా ప్రక్రియ పూర్తి చేయాలి. అదీకాక,కొత్త కనెక్షన్ కావాలనుకునే వారు ఇకపై భౌతిక పత్రాలతో అధికారుల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదు. సంబంధిత డిస్కంల అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆధార్ కార్డ్, ఆస్తి పత్రాలు వంటి అవసరమైన సర్టిఫికెట్లను స్కాన్ చేసి అప్‌లోడ్ చేస్తే సరిపోతుంది. అదేవిధంగా వినియోగదారుడి దరఖాస్తు ఏ దశలో ఉందో ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ట్రాక్ చేయవచ్చు. అధికారుల నిర్లక్ష్యం వల్ల జాప్యం జరిగితే ఆటోమేటిక్‌గా ఉన్నతాధికారులకు సమాచారం ఎస్కలేట్ అవుతుంది.

## మహిళా న్యాయవాది దారుణ హత్య

మొదటి పేజీ తరువాయి

పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లాయర్ స్వప్న హత్యను నిరసిస్తూ మొయినాబాద్ పోలీస్ స్టేషన్ ఎదుట న్యాయవాదులు ఆందోళన చేపట్టారు. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. అటు.. హైకోర్టు ప్రాంగణంలో జరిగిన నిరసనల్లో ప్రముఖ న్యాయవాది నవీన్ కుమార్ వాసిరెడ్డి పాల్గొన్నారు. స్వప్న హత్యపై మాట్లాడుతూ.. నిందితుడిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యాయవాదులపై ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

# సీఎంవా? వీధి రౌడీవా?


**అమ్మతోడు అని మోసం చేసినవ్**

**రాజీనామా జిరాక్స్ పేపర్ దొంగవు**

**ఆంధ్రాలో మోచేతి నీళ్లు తాగేటోనివి**

**సీఎం రేవంత్‌పై హరీశ్ రావు ఫైర్**

మెదక్, ఫిబ్రవరి 4 (ఈవార్తలు): తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై మాజీమంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నువ్వు ముఖ్యమంత్రివా? లేక వీధి రౌడీవా? అని నిలదీశారు. అవ్వతాతలు పెన్షన్ అడిగితే లాగుల తొండలు వదులుతా అంటావా అని మండిపడ్డారు. ఆడబిడ్డలు మహాలక్ష్మి రూ.2500 అడిగితే పేగులు తీసి మెడలో వేసుకుంటానని అంటావా? అని మాజీమంత్రి హరీశ్ రావు ప్రశ్నించారు. 'రేవంత్ రెడ్డి.. నువ్వు ముఖ్యమంత్రివా? లేక వీధి రౌడీవా? అని అడుగుతున్నా. అవ్వతాతలు రూ. 4000 పెన్షన్ ఎప్పుడు ఇస్తావ్ అని అడిగితే లాగుల తొండలు వదులుతా అంటావా?'అని మాజీమంత్రి హరీశ్ రావు ఫైర్ అయ్యారు. బాండ్ పేపర్లు రాసిచ్చి, అమ్మతోడు అని చెప్పి మోసం చేశావు కదా అని మండిపడ్డారు. ఆడబిడ్డలు మహాలక్ష్మి రూ. 2500 అడిగితే 'పేగులు తీసి మెడలో వేసుకుంటా' అంటావా? ఇదేనా నీ సంస్కారం? నీ రౌడీయిజం సాగదు ఖబర్దార్ అని మాజీమంత్రి హరీశ్ రావు హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీకి గెలిచే దమ్ములేక....ఓడిపోతామనే భయంతో బీఆర్ఎస్ అభ్యర్థులను బెదిరించి, ప్రలోభపెట్టి పార్టీలు మారుస్తున్నారని మాజీ మంత్రి హరీష్ రావు మండిపడ్డారు. మెదక్ మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడిన మాజీమంత్రి హరీశ్ రావు...ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భాషపై, పాలనపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గెలిచే దమ్ములేక మా అభ్యర్థులను ఎత్తుకెళ్తున్నారు.. వడ్డీతో సహా చెల్లిస్తాం గుర్తుపెట్టుకోండి అని మాజీమంత్రి హరీశ్ రావు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. తెలంగాణ కోసం డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే, ఎంపీ, కేంద్ర మంత్రి పదవులను గడ్డిపోచల్లా విసిరేసిన మహనీయుడు కేసీఆర్ అని మాజీమంత్రి హరీశ్ రావు గుర్తు చేశారు. కేసీఆర్ చెబితే మేము కూడా పదవులకు రాజీనామా చేసి ఆంధ్రా పాలకుల ముఖం మీద కొట్టినం. మరి నువ్వు? రాజీనామా చేయమంటే జిరాక్స్ పేపర్ పంపిన దొంగవు అని మాజీమంత్రి హరీశ్ రావు ధ్వజమెత్తారు. తెలంగాణ ఉద్యమకారుల మీద తుపాకీ గురిపెట్టిన ద్రోహివి అని మండిపడ్డారు. కేసీఆర్ ప్రాణ త్యాగానికి సిద్ధపడి తెలంగాణ తెచ్చారు కాబట్టే నువ్వు ఈరోజు సీఎం కుర్చీలో ఉన్నావు. లేకపోతే ఆంధ్రాలో మోచేతి నీళ్లు తాగుతూ, బ్యాగులు మోసుకుంటూ బతికేవాడివి అని మాజీమంత్రి హరీశ్



రావు మండిపడ్డారు. 'కాంగ్రెస్ పార్టీకి గెలిచే సత్తా ఉంటే మా అభ్యర్థులను ఎందుకు ఎత్తుకెళ్తున్నారు? జనం మీకు ఓటు వేయరని అర్థమై పోలీసులతో బెదిరించి, బ్లాక్ మెయిల్ చేసి కండువాలు కప్పుతున్నారు'అని మాజీమంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఎవరెవరు అమ్ముడుపోతున్నారో, ఎవరు ఎందుకు ఎత్తుకుపోతున్నారో అందరినీ గుర్తుపెట్టుకుంటాం. సమయం వచ్చినప్పుడు వడ్డీతో సహా చెల్లిస్తాం'అని మాజీమంత్రి హెచ్చరించారు. 'ఇప్పటివరకు రైతు బంధు ఇవ్వలేదు. ఫిబ్రవరి 11వ తేదీలోగా రైతు బంధు పడకపోతే.. రైతులు నీ చెడ్డీల తొండలు తొడిగి ఏడిపిస్తారు. నిన్ను చీరిచింతకు చెండాడుతారు. రుణమాఫీ పేరుతో దేవుళ్లనే మోసం చేసిన ఘనుడివి నువ్వు. నీ అబద్ధాలను రైతులు నమ్మే స్థితిలో లేరు'అని మాజీమంత్రి హరీశ్ రావు అన్నారు. 'మెదక్ జిల్లా కల నెరవేర్చింది కేసీఆర్. ఇక్కడికి కలెక్టర్ ఆఫీసు, ఎస్పీ ఆఫీసు, రైలు, నాలుగు లైన్ల రోడ్డు తెచ్చింది కేసీఆర్. ఘనపూర్ ఆయకట్టుకు నీళ్లు ఇచ్చింది మేము. సిద్దిపేటతో సమానంగా మెదక్‌ను అభివృద్ధి చేశాం'అని మాజీమంత్రి హరీశ్ రావు వెల్లడించారు. 'కాంగ్రెస్ వచ్చాక ఇక్కడ ఒక్క రూపాయి పని జరగలేదు. మెదక్‌లో ఓట్లు అడిగే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదు. ఏ కార్యకర్తకు ఏ ఇబ్బంది వచ్చినా మీకు మీ హరీష్ అన్న ఉన్నాడు.. నేను చూసుకుంటా. కాంగ్రెస్ గుండా రాజకీయాన్ని, మోసాలను ఎండగట్టండి. బీజేపీకి 8 మంది ఎంపీలను ఇస్తే బడ్జెట్‌లో గుండు సున్నా ఇచ్చారు. కాబట్టి కారు గుర్తుకే ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించండి. మెదక్ అభివృద్ధిని కొనసాగిద్దాం'అని మాజీమంత్రి హరీశ్ రావు పిలుపునిచ్చారు.



# దేశ సినిమాకు హైదరాబాద్ పిన్ పాయింట్

**సమాజం కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు గద్దర్: భట్టి**

**ఉగాది రోజున ఘనంగా గద్దర్ సినిమా అవార్డుల ప్రదానోత్సవం**

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఈవార్తలు): దేశవ్యాప్తంగా ఉన్న సినీ పరిశ్రమకు హైదరాబాద్‌ను ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు. బుధవారం నాడు సచివాలయంలో గద్దర్ సినిమా అవార్డుల జ్యూరీ సభ్యులతో జరిగిన సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం తెలుగు సినీ పరిశ్రమకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఆయన తెలిపారు. ముంబై, చెన్నై, కోల్‌కతా వంటి నగరాల్లో సినీ పరిశ్రమ విస్తరణకు అవకాశాలు పరిమితంగా ఉన్నాయని, కానీ అన్ని భాషల పరిశ్రమలు హైదరాబాద్‌లో అభివృద్ధి చెందడానికి అనేక సానుకూల అంశాలు ఉన్నాయని భట్టి విశ్లేషించారు. సకల భాషల చిత్ర పరిశ్రమలు హైదరాబాద్‌కు తరలివస్తే రాష్ట్ర యువతకు, టెక్నీషియన్లకు, రచయితలకు, దర్శకులకు భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ సినీ మార్కెట్‌కు హైదరాబాద్ కేంద్రంగా మారనుందని, ఇందుకు సంబంధించిన బ్లూప్రింట్‌ను ప్రభుత్వం సిద్ధం చేస్తోందని వెల్లడించారు. గత ప్రభుత్వం దశాబ్దాలుగా సినిమా అవార్డులను నిర్లక్ష్యం చేసిందని, కానీ తమ ప్రభుత్వం సినీ రంగానికి తిరిగి పురస్కారాలు అందించి ప్రోత్సహిస్తోందని భట్టి వివరించారు. సమాజం కోసం, కళల ద్వారా తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మహానుభావుడు గద్దర్ అని ఆయన కొనియాడారు. తెలంగాణ కళలు, సంస్కృతి, విప్లవ స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన వ్యక్తి గద్దర్ అని, అందుకే ఆయన పేరు మీద గత ఏడాది నుంచి అవార్డులు అందిస్తున్నామని తెలిపారు. గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా ప్రతిభ, పారదర్శకత ఆధారంగానే అవార్డుల ఎంపిక ఉంటుందని భట్టి హామీ ఇచ్చారు. గద్దర్ అవార్డుకు ఎంపికయ్యే సినిమాల్లో వాణిజ్య అంశాలతో పాటు బలమైన సామాజిక సందేశం ఉండేలా చూడాలని జ్యూరీ సభ్యులకు సూచించారు. ఈ నెల 6 నుంచి అవార్డుల స్క్రీనింగ్ ప్రారంభమవుతుందని, ఫిబ్రవరి 19న ఉగాది పర్వదినం నాడు అవార్డుల ప్రదానోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, ఐ అండ్ పీఆర్ కమిషనర్ ప్రియాంక, ఎఫ్‌డీసీ ఈడీ కిశోర్ బాబుతో పాటు సినీ ప్రముఖులు తనికెళ్ల భరణి, కేఎస్ రామారావు, రోజా రమణి, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రాత్రి 11 గంటలకు ఈ లొల్లేంది?

**మసీదు స్పీకర్‌పై ధర్మపురి అర్వింద్**

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఈవార్తలు): బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఎక్స్ వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ నివాసానికి దగ్గరగా ఉన్న మసీదు వద్ద ఏర్పాటు చేసిన స్పీకర్ నుంచి పెద్ద ఎత్తున శబ్దం వస్తోందని ఆయన మండిపడ్డారు. ఈ శబ్దం వినిపిస్తున్న వీడియో తీసి ఎక్స్ లో పోస్ట్ చేశారు. రాత్రి 11 గంటల సమయంలో ఈ కర్ణభేరి పరీక్ష ఏమిటని ఆయన ప్రశ్నించారు. మరో 15 రోజుల్లో పదో తరగతి పరీక్షలు ఉన్నాయని... ఆ తర్వాత ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతాయని అర్వింద్ తెలిపారు. ఇలాంటి తరుణంలో రాత్రి 11 గంటలకు ఇదేమిటని ప్రశ్నించారు. "భాయ్... మీకు జాగారం కావాలంటే చేసుకోండి. మమ్మల్ని పడుకోనివ్వండి" అని అన్నారు. మరోవైపు, అర్వింద్ ట్వీట్ పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలోనే ఆయన ఈ ట్వీట్ చేశారని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. ఏ ప్రార్థనా మందిరం అయినా ప్రజలకు ఇబ్బంది కలగకుండా, స్పీకర్లను తొలగించాలని మరికొందరు సూచిస్తున్నారు.

## రూ.15 లక్షల లంచగొండి

**ఏసీబీకి చిక్కిన జీహెచ్‌ఎంసీ అధికారి**

కూకట్‌పల్లి/హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఈవార్తలు): జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి జోన్ ఎస్‌ఈ చిన్నారెడ్డి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కు చిక్కాడు. రూ.15 లక్షలు లంచం తీసుకుంటూ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఏసీబీ అధికారులు ఈరోజు జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో తనిఖీలు చేపట్టారు. కార్యాలయంలోని పత్రాలను పరిశీలిస్తున్నారు. చిన్నారెడ్డి ఆస్తులు, ఇతర అంశాలపై ఏసీబీ ఆరా తీస్తోంది. బిల్లులు మంజూరు చేయడానికి తనకు 15 లక్షల లంచం ఇవ్వాలని ఒక కాంట్రాక్టర్‌ను డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. దీంతో ఆ కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. కార్యాలయంతో పాటు చిన్నారెడ్డి నివాసంలోనూ ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు.



# మున్సిపల్ ఎన్నికల్లో పవన్ ప్రచారం

**ఎన్డీయే అభ్యర్థుల తరఫున క్యాంపెయినింగ్**

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఈవార్తలు): తెలంగాణలో ఈ నెల 11న జరగనున్న మునిసిపల్, కార్పొరేషన్ ఎన్నికలు రాజకీయంగా ఆసక్తికరంగా మారాయి. మొత్తం 116 మునిసిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఒకేసారి పోలింగ్ జరగనుంది. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ పూర్తవడంతో ఇప్పుడు ఎన్నికల ప్రచారం దశకు చేరుకుంది. ప్రధాన పార్టీలన్నీ క్షేత్రస్థాయిలో వ్యూహాలు సిద్ధం చేసుకుంటూ ప్రచారాన్ని వేగవంతం చేస్తున్నాయి. భారత రాష్ట్ర సమితి ఇప్పటికే ప్రచారాన్ని ప్రారంభించింది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ కూడా స్థానిక నేతలతో సమావేశాలు నిర్వహిస్తూ ప్రత్యర్థులను ఎదుర్కొనేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. భారతీయ జనతా పార్టీ సైతం ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని, బలమైన ప్రచారానికి సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో తాజాగా మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ తెలంగాణ ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నట్లు అధికారిక ప్రకటన వెలువడింది. ఈ నెల 7, 8 తేదీల్లో ఆయన తెలంగాణలోని పలు మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో ప్రచారం చేయనున్నారని జనసేన పార్టీ కార్యాలయం వెల్లడించింది. అయితే ఆయన ఏ ప్రాంతాల్లో ప్రచారం చేస్తారన్న వివరాలను త్వరలో ప్రకటిస్తామని పార్టీ తెలిపింది. ఈ ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ ఎన్డీయే మిత్రపక్షాల తరఫున ప్రచారం చేయనున్నట్లు స్పష్టత ఇచ్చారు. అటు.. బీజేపీకి జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మద్దతు ప్రకటించారని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు ప్రకటించారు. పవన్ కళ్యాణ్ తో తాను, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సమావేశమయినట్టు రాంచందర్ రావు ఎక్స్ వేదికగా తెలిపారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికలతో పాటు పలు కీలక అంశాలపై తమ మధ్య చర్చ జరిగిందని వెల్లడించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి పవన్ పూర్తి మద్దతు ప్రకటించారని... బీజేపీ తరఫున ప్రచారం చేయడానికి అంగీకరించారని పేర్కొన్నారు. పవన్ మద్దతు తెలంగాణ బీజేపీకి తిరుగులేని బలాన్ని, వేగాన్ని ఇస్తుందని అన్నారు. జనసేన ఇప్పటికే ఎన్డీయేలో కీలక భాగస్వామిగా ఉంది. ప్రస్తుతం తెలంగాణలో ఎన్డీయేకు బలమైన ప్రాంతీయ మిత్రపక్షాలు లేకపోయినా, బీజేపీకి మద్దతుగా జనసేన రంగంలోకి దిగుతోంది. ఈ నేపథ్యంలో పవన్ కళ్యాణ్ ప్రధానంగా బీజేపీ అభ్యర్థులకు అనుకూలంగా ప్రచారం చేసే అవకాశం ఉందన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. వాస్తవానికి ఈ స్థానిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన పోటీ చేయాలని మొదట ఆలోచన చేశాయి. కానీ కొన్ని అనివార్య కారణాలతో ఆ నిర్ణయాన్ని విరమించుకున్నాయి. పోటీకి దూరంగా ఉన్నప్పటికీ, ప్రచార పరంగా మాత్రం తమ రాజకీయ ప్రభావాన్ని చూపాలని ఈ రెండు పార్టీలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే పవన్ కళ్యాణ్ ప్రచారానికి సిద్ధమయ్యారని విశ్లేషకులు అంటున్నారు. ఇక బీజేపీ ఈ ఎన్నికలను భవిష్యత్తు రాజకీయాలకు కీలకంగా భావిస్తోంది. 116 మునిసిపాలిటీల్లో కనీసం 50 శాతం స్థానాలు దక్కించుకోవడమే లక్ష్యంగా వ్యూహం రూపొందించుకుంది. దీని ద్వారా రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు బలమైన పునాది వేసుకోవాలని పార్టీ భావిస్తోంది. ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు జనాదరణ ఉన్న నేతగా గుర్తింపు పొందిన పవన్ కళ్యాణ్‌ను ప్రచారంలోకి దించడం రాజకీయంగా కీలక అడుగుగా మారింది. దీంతో తెలంగాణ మునిసిపల్ ఎన్నికలు మరింత ఉత్కంఠభరితంగా మారనున్నాయి.

# పవన్ ప్రచారం ఇక్కడ పనికిరాదు

**ప్రమాదంలో తెలంగాణ బీజేపీ ఉనికి.. టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఈవార్తలు): మున్సిపల్ ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ ప్రచారం చేయనున్నారనే వార్తలపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. తెలంగాణ ప్రజలు పవన్ కళ్యాణ్ చెప్పే మాటలను నమ్మరని అన్నారు. తెలంగాణలో బీజేపీ ఉనికి ప్రమాదంలో ఉందని విమర్శించారు. "తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో మొత్తం కాంగ్రెస్ గెలిచే పరిస్థితి ఉంది... అది అర్థమయ్యే బీజేపీ నాయకులు పవన్ కళ్యాణ్ వద్దకు వెళ్లారు. పవన్ కళ్యాణ్ గతంలో తెలంగాణ రాష్ట్రం గురించి, భాష గురించి, యాస గురించి, నడవడి గురించి కొంత విమర్శలు చేశారు. అందుకే తెలంగాణ ప్రజలు పవన్ కళ్యాణ్ చెప్పే మాటలను నమ్మరు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉంది. 90 నుంచి 95 శాతం మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లను కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంటుంది. బీజేపీ ఉనికి ప్రమాదంలో ఉంది. అందుకే, పవన్ కళ్యాణ్ సాయం కోరినట్టుగా



కనిపిస్తుంది" అని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. దేశంలో విద్వేషాలు రెచ్చగొట్టడమే బీజేపీ పనిగా పెట్టుకుందని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. తెలంగాణలో కూడా బీజేపీ అదే ప్రయత్నం చేద్దామని చూస్తుందని... కానీ ఇక్కడ ఆ పార్టీ ఆటలు సాగవని అన్నారు. తెలంగాణ ప్రజలు విజ్ఞులు అని... బీజేపీ రెచ్చగొట్టే విధానానికి వ్యతిరేకంగా నిలబడతారని అన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కులం, మతం పేరుతో విద్వేషాలను రెచ్చగొట్టాలని చూసిన బీజేపీకి డిపాజిట్ కూడా దక్కలేదని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం బీసీల కోసం చేసిన చట్టాలను మోదీ ప్రభుత్వం తొక్కిపెట్టిందని విమర్శించారు. తెలంగాణ ప్రజల కడుతున్న ట్యాక్స్ గుజరాత్, ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకు దోచిపెట్టడానికా? అని ప్రశ్నించారు. ఏం ముఖం పెట్టుకుని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఇక్కడికి ప్రచారానికి వస్తున్నారని అడిగారు. బీజేపీ నేతలు వీటన్నింటికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

### తీవ్రంగా స్పందించిన తెలంగాణ జనసేన

టీపీసీసీచీఫ్ వ్యాఖ్యలపై తెలంగాణ జనసేన స్పందిస్తూ... కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ తెలంగాణ రాష్ట్ర పార్టీలు కాదని.. అవి జాతీయ పార్టీలని తెలిపింది. జనసేన అనేది కేవలం ఆంధ్రప్రదేశ్ కోసం పెట్టిన పార్టీ కాదని, జాతీయ సమగ్రత కోసం తెలంగాణలో పెట్టిన పార్టీ అని పేర్కొంది. ప్రాంతీయ విభేదాలు సృష్టిస్తే ఊరుకోబోమని హెచ్చరించింది.


# జర్నలిస్టులకు అండగా మీడియా అకాడమీ

**కుటుంబాలకు రూ. లక్ష ఆర్థిక సహాయం అందజేత**

**ముఖ్య అతిథిగా పాల్గొన్న మండలి చైర్మన్ గుత్తా**

**10 మంది ప్రముఖ జర్నలిస్టులపై మోనోగ్రాఫ్‌ల ఆవిష్కరణ**

నాంపల్లి/హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఈవార్తలు): తెలంగాణ మీడియా అకాడమీ, మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు అండగా నిలిచింది. వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు, ప్రముఖ జర్నలిస్టుల జీవిత విశేషాలతో కూడిన చిరు పుస్తకాలను ఆవిష్కరించింది. బుధవారం నాడు హైదరాబాద్ నాంపల్లిలోని మీడియా అకాడమీ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ, అక్షరాన్నే ఆయుధంగా చేసుకుని క్షేత్రస్థాయిలో పనిచేసే జర్నలిస్టులు అకాల మరణం చెందడం బాధాకరమని అన్నారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు అండగా నిలుస్తూ, వారికి ఆర్థిక భరోసా కల్పిస్తున్న మీడియా అకాడమీ చైర్మన్‌ను ఆయన అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమ నిధి నుంచి లక్ష రూపాయల ఆర్థిక సహాయంతో పాటు, ఐదేళ్లపాటు పెన్షన్ అందిస్తుండటం బాధిత కుటుంబాలకు గొప్ప ఊరట అని పేర్కొన్నారు. ప్రముఖ జర్నలిస్టుల జీవిత విశేషాలతో కూడిన చిరు పుస్తకాల (మోనోగ్రాఫ్స్) ఆవిష్కరణ, రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. ఎన్ని ఎలక్ట్రానిక్ మీడియా సాధనాలు వచ్చినా, తాను మాత్రం ఇప్పటికీ పత్రిక చదివితేనే సంతృప్తి చెందుతానని తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు మాట్లాడుతూ, ప్రముఖుల జీవిత చరిత్రను మోనోగ్రాఫ్‌గా తీసుకురావడం ప్రశంసనీయమన్నారు. సమాజానికి వార్త అద్దం పడితే, దాని వెనకున్న నిజాన్ని నిగ్గు తేల్చిన జర్నలిస్టు భవిష్యత్ తరాలకు



మార్గదర్శి అవుతారని అన్నారు. సోషల్ మీడియాను నియంత్రించడం ఎవరి తరం కాదని, దానిపై జర్నలిస్టులందరూ ఏకతాటిపైకి వచ్చి వర్క్‌షాప్‌లు నిర్వహించడం ద్వారా కొంత మార్పునకు నాంది పలకాలని సూచించారు. మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, మరణించిన 18 మంది జర్నలిస్టుల కుటుంబాలకు తలా లక్ష రూపాయల చొప్పున, ప్రమాదానికి గురైన మరో జర్నలిస్టుకు రూ. 50,000 ఆర్థిక సహాయం చెక్కుల రూపంలో అందించినట్లు తెలిపారు. అలాగే, ప్రముఖ పాత్రికేయులు అబిద్ అలీఖాన్, డి. సీతారాం, పొత్తూరి వెంకటేశ్వరరావు, ఎ.బి.కె. ప్రసాద్, సి. రాఘవాచారి సహా 10 మంది దిగ్గజాలపై మీడియా అకాడమీ ప్రచురించిన మోనోగ్రాఫ్‌లను ఆవిష్కరించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు, పలువురు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

# స్పీకర్ తీరు రాజ్యాంగానికే గొడ్డలిపెట్టు

**ఫిరాయింపు ఎమ్మెల్యేలపై పిటిషన్ల కొట్టివేత రాజ్యాంగ విరుద్ధమన్న కేటీఆర్**

**సీఎం రేవంత్ ఆదేశాలతోనే స్పీకర్ నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపణ**

**వీడియో సాక్ష్యాలున్నా ఆధారాలు లేవనడం హాస్యాస్పదమంటూ ట్వీట్**

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఈవార్తలు): తెలంగాణలో ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీసుకుంటున్న నిర్ణయాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను వరుసగా కొట్టివేయడం రాజ్యాంగానికి గొడ్డలిపెట్టు అని, ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఆయన తీవ్రంగా ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకే స్పీకర్ నడుచుకుంటున్నారని, రాజ్యాంగబద్ధంగా వ్యవహరించడం లేదని విమర్శించారు. సోషల్ మీడియాలో స్పందిస్తూ, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌పై అనర్హత పిటిషన్‌ను స్పీకర్ కొట్టివేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే సంజయ్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఫోటోలు, వీడియోలు కళ్లముందు కనిపిస్తున్నా, ఆధారాలు లేవంటూ పిటిషన్‌ను తిరస్కరించడం అర్థరహితమని అన్నారు. ఈ చర్య ద్వారా స్పీకర్ తన పదవికే అవమానం తెస్తున్నారని, అటు సుప్రీంకోర్టు తీర్పును, ఇటు ప్రజాతీర్పును కాలరాస్తున్నారని మండిపడ్డారు. జగిత్యాలలో మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ, కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డే ఆ ఫిరాయింపు ఎమ్మెల్యేను విమర్శిస్తున్న తరుణంలో స్పీకర్ ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి ఉప ఎన్నికలంటే భయం పట్టుకుందని, అందుకే ఈ నాటకాలాడుతోందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయంతో కాంగ్రెస్ ఇంకా కోలుకోలేదని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లోనూ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజాగ్రహం చూసి రేవంత్ సర్కారు వణికిపోతోందని అన్నారు. ఈ మొత్తం పార్టీ ఫిరాయింపుల వ్యవహారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే సూత్రధారి అని కేటీఆర్ ఆరోపించారు. ఆయన ఢిల్లీకి పంపే మూటలకు ఆశపడి రాహుల్ గాంధీ మౌనం వహిస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇకపై రాజ్యాంగం గురించి మాట్లాడే నైతిక హక్కు రాహుల్ గాంధీకి లేదని స్పష్టం చేశారు. పట్టపగలే పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారినా ఒక్కరిపైనా చర్యలు తీసుకోకపోవడం వికృత రాజకీయ క్రీడ అని, ఈ చర్యలకు ప్రజాక్షేత్రంలోనే కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం తప్పదని కేటీఆర్ హెచ్చరించారు.





మల్యాల మండలకేంద్రంలో రేణుక ఎల్లమ్మ తల్లి పట్నాలకు హాజరై అమ్మవారిని దర్శించుకున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



## 14 నుంచి కురవి బ్రహ్మోత్సవాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఈవార్తలు): కురవి శ్రీ వీరభద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 14వ తేదీ నుంచి మార్చి 1వ తేదీ వరకు జరుగుతాయని ఉత్సవ కమిటీ సభ్యుడు కాసుల మల్లిఖార్జున్ తెలిపారు. శ్రీ వీరభద్రస్వామి సేవా సమితి అధ్యక్షులు, సంఘ సేవకుడు షాబాద్ వెంకటేశం, ప్రధాన కార్యదర్శి కాసుల వినోద్‌తో కలిసి బుధవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 14న అంకురార్పణ, 15న మహాశివరాత్రి, శ్రీ స్వామివారి కళ్యాణోత్సవం, 18న తెప్పోత్సవం, 20న రథోత్సవం, 21న బండ్లు తిరుగుట, 22న వసంతోత్సవం, త్రిశూలస్నానం, నాగవెల్లి, 23న పవళింపు సేవ, 27న శ్రీ పార్వతి రామలింగేశ్వరస్వామి వారి కళ్యాణోత్సవం, మార్చి 1న పదహారు రోజుల పండుగ జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని వారు విజ్ఞప్తి చేశారు. శ్రీ వీరభద్ర సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీన 4వేల మందికి పైగా భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. డిప్యూటీ స్పీకర్ జె.రాంచందర్ నాయక్, ఉత్సవ కమిటి చైర్మన్ కూర రవీందర్ రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి సత్యనారాయణల నేతృత్వంలో బ్రహ్మోత్స ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయని తెలిపారు. నర్రా దేవేందర్. కొండూరు వినోద్ కుమార్, విజయ్. ఆనంద్, చిత్రంజన్, హరిబాబు, కె. దేవేందర్, కె.రమణ, కె.చంద్రుడు, సతీష్ కుమార్, సాయి కిరణ్, కిషోర్, విజయభారతి, శ్వేత, స్రవంతి, స్వాతి, లక్ష్మీ, వందన, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ బరిలో 12,944 మంది

### కాంగ్రెస్ నుంచి 2,948 మంది.. బీఆర్ఎస్ నుంచి 2,878

### బీజేపీ నుంచి 2,634.. మొత్తం 123 చోట్ల ఎన్నికలు




హైదరాబాద్, ఫిబ్రవరి 4(ఈవార్తలు): మున్సిపల్ ఎన్నికల బరిలో 12,944 మంది బరిలో నిలిచారు. మెజారిటీ స్థానాల్లో చతుర్ముఖ పోటీ నెలకొన్నది. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ మంగళవారం ముగియడంతో బుధవారం తుది అభ్యర్థుల జాబితా ఖరారైంది. మొత్తం 123 చోట్ల ఎన్నికలు జరుగనుండగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లోని 2,996 వార్డుల్లో 12,944 మంది పోటీలో ఉన్నట్టు బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఈ మేరకు అభ్యర్థుల జాబితాను మున్సిపాలిటీ వార్డులవారీగా, పార్టీల వారీగా వేర్వేరు జాబితాలను విడుదల చేసింది. తిరుగుబాటు అభ్యర్థులు(రెబల్స్) చాలా చోట్ల పార్టీలకు సవాల్‌గా మారినట్టు తెలుస్తున్నది. అధికార కాంగ్రెస్ నుంచి 2,948మంది, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ నుంచి 2,878, బీజేపీ నుంచి 2,634, జనసేన పార్టీ(జేఎస్పీ) నుంచి 332, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి (ఏఐఎఫ్‌బీ) 288, ఎంఐఎం నుంచి 282మంది, ఇతరులు పోటీలో ఉన్నారు. ఇతర గుర్తింపు పొందిన పార్టీల నుంచి 796 మంది ఉండగా, స్వతంత్ర అభ్యర్థులు 2,786 మంది పోటీలో ఉన్నారు. ఈ ఎన్నికల్లో సగటున ఒక్కో సీటుకు నలుగురు అభ్యర్థులు పోటీ పడుతున్నారు. కానీ, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్య త్రిముఖ పోరు ఉండేలా కనిపిస్తున్నది. ముఖ్యంగా వామపక్షాల పొత్తులతో అన్ని స్థానాల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ అభ్యర్థులు బరిలో హోరాహోరీ పోరు వీరిద్దరి మధ్యే ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. హుజూరాబాద్‌లో 30 వార్డులకు గాను బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్, పార్టీలు అన్ని స్థానాల్లోనూ 30చొప్పున తమ అభ్యర్థులను రంగంలోకి దింపాయి. తమ ప్రభావం ఉన్న మున్సిపాలిటీల్లోనే బీజేపీ, ఎంఎంఐ, ఏఐఎఫ్‌బీ అభ్యర్థులు బరిలో నిలిచారు. ఎంఐఎం తనకు ప్రభావం ఉన్న ఆదిలాబాద్‌లో 19, జగిత్యాలలో 8, కోరుట్లలో 13మంది అభ్యర్థులను బరిలో నిలిపింది. 11న జరిగే పోలింగ్‌లో సుమారు 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హకును వినియోగించు కోనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ మున్సిపాలిటీల్లోని 14 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. 123 పట్టణ స్థానిక సంస్థల్లోని 2,996 వార్డులు/డివిజన్లకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా, 14 చోట్ల పోటీ లేకపోవడంతో అవి ఏకగ్రీవంగా మారాయి. సూర్యాపేట జిల్లా కోదాడ మున్సిపాలిటీలోని 11, 21, 31వ వార్డులు, హుజూర్‌నగర్‌లోని 3వ వార్డు, మెదక్‌లోని 32వ వార్డు, వికారాబాద్ మున్సిపాలిటీలోని 1వ, 15వ వార్డు, యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్టలో 10వ వార్డు, చౌటుప్పల్‌లో 17వ వార్డు, మెదక్‌లోని 32వ వార్డు, నల్లగొండ జిల్లా హాలియా మున్సిపాలిటీలోని 10వ వార్డు, జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లోని 10వ వార్డు, ఖమ్మం జిల్లా ఎదులాపురంలోని 15 వార్డు ఏకగ్రీవమయ్యాయి. మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌లోని 58వ డివిజన్, పెద్దపల్లి జిల్లా రామగుండం కార్పొరేషన్‌లోని 1వ డివిజన్ ఏకగ్రీవమైంది. అలంపూర్ 10 వార్డుతో పాటు వికారాబాద్ 15వ వార్డును బీఆర్ఎస్ అభ్యర్థులు కైవసం చేసుకోగా, మిగతా కాంగ్రెస్ అభ్యర్థులు ఎన్నికయ్యారు. ఏకగ్రీ వాలు పోను, మిగిలిన స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులుఅదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.


# చంద్రబాబు-పవన్ మాటామాముచ్చట

**రెండున్నర గంటలపాటు సాగిన భేటీ**

**వైసీపీ తీరు, కూటమి సమన్వయంపై చర్చ**

**రాజ్యసభ, నామినేటెడ్ పదవులపై సమాలోచనలు**

**క్షేత్రస్థాయిలో ఉమ్మడి కార్యాచరణకు నిర్ణయం**



అమరావతి, ఫిబ్రవరి 4 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మధ్య అమరావతిలో జరిగిన కీలక భేటీ ముగిసింది. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో ఈ సమావేశం సుమారు రెండున్నర గంటల పాటు కొనసాగింది. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలు, కూటమి పక్షాల మధ్య సమన్వయం, భవిష్యత్ కార్యాచరణ వంటి అనేక కీలక అంశాలపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా, వైసీపీ అనుసరిస్తున్న వైఖరి పైనే ఈ సమావేశంలో ఎక్కువగా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. కుల రాజకీయాలను రెచ్చగొట్టడం ద్వారా వైసీపీ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తోందని, ఆ పార్టీ పన్నుతున్న వ్యూహాలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని ఇరువురు నేతలు నిర్ణయించుకున్నారు. వైసీపీ ట్రాప్‌లో పడకుండా కూటమి శ్రేణులను అప్రమత్తం చేసేందుకు ఉమ్మడి వ్యూహంతో ముందుకు సాగాలని తీర్మానించుకున్నారు. క్షేత్రస్థాయిలో టీడీపీ, జనసేన కార్యకర్తల మధ్య వైసీపీ చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తోందని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఇరువురు నేతలు ఓ అభిప్రాయానికి వచ్చారు. ఈ భేటీలో రాజకీయ అంశాలతో పాటు పరిపాలనాపరమైన విషయాలు కూడా ప్రస్తావనకు వచ్చాయి. త్వరలో ఖాళీ కానున్న నాలుగు రాజ్యసభ స్థానాల భర్తీపై నేతలు ప్రాథమికంగా చర్చించినట్లు సమాచారం. అలాగే, చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని కూడా నిర్ణయించినట్లు తెలుస్తోంది. వివిధ కార్పొరేషన్లకు ఛైర్మన్లతో పాటు డైరెక్టర్ల నియామకంపై కూడా సమాలోచనలు జరిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య క్షేత్రస్థాయిలో సమన్వయం మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఈ సమావేశంలో అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. తిరుమల లడ్డూ ప్రసాదం వంటి అంశాలపై వైసీపీ సోషల్ మీడియాలో చేస్తున్న విష ప్రచారాన్ని సమష్టిగా తిప్పికొట్టాలని, ఇందుకోసం కూటమిలోని మూడు పార్టీల నేతలు కలిసి ఉమ్మడి మీడియా సమావేశాలు నిర్వహించాలని పవన్ సూచించినట్లు సమాచారం. రాబోయే 15 ఏళ్లు కూటమే అధికారంలో కొనసాగేలా పటిష్టమైన భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవాలనే దిశగా కూడా వీరి మధ్య చర్చలు సాగినట్లు తెలుస్తోంది. మంగళవారం కేబినెట్ భేటీకి ముందు చంద్రబాబు, పవన్ క్లుప్తంగా మాట్లాడుకున్నప్పటికీ, అన్ని అంశాలపై విపులంగా చర్చించేందుకు ఈరోజు ప్రత్యేకంగా భేటీ అయ్యారు.



## చంద్రబాబుతో గద్దర్ కుమార్తె వెన్నెల భేటీ

అమరావతి, ఫిబ్రవరి 4 (ఈవార్తలు): ప్రముఖ ప్రజా గాయకుడు, విప్లవ కవి గద్దర్ కుమార్తె వెన్నెల ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ఆయనకు ఒక వినతిపత్రం సమర్పించారు. ఏపీలో గద్దర్ విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని, అలాగే ఆంధ్రా యూనివర్సిటీలోని ఆర్ట్స్ అండ్ కల్చరల్ విభాగానికి ఆయన పేరు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వెన్నెల... తెలుగు సాంస్కృతిక రంగానికి, ప్రజా ఉద్యమాలకు గద్దర్ చేసిన సేవలను గుర్తు చేశారు. తమ విజ్ఞప్తులపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించారని వెన్నెల తెలిపారు. తమ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తగిన చర్యలు తీసుకుంటారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

# మీ పరిస్థితి మీ ఊహకే

**వైసీపీ అధికారంలోకి వస్తే చుక్కలే**

**చంద్రబాబు శ్రేణులకు జగన్ హెచ్చరిక**

గుంటూరు, ఫిబ్రవరి 4 (ఈవార్తలు): ఏపీ సీఎం చంద్రబాబు రెడ్ బుక్‌తో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు గాడి తప్పి, జంగిల్ రాజ్‌లా మారిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మీ పరిస్థితి ఏంటో ఆలోచించుకోవాలని హెచ్చరించారు. ఇటీవల గుంటూరులో మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటిపై టీడీపీ మూకల దాడి, అంబటి రాంబాబు అరెస్టు వ్యవహారం తరువాత బుధవారం అంబటి కుటుంబాన్ని జగన్ పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ధ్వంసమైన ఇంటి వస్తువులను, కార్లను పరిశీలించారు. అనంతరం అంబటి గారి కుటుంబ సభ్యులతో మాట్లాడి అధైర్యపడొద్దని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిపోయిందని, జంగిల్ రాజ్ నడుస్తోందని జగన్ తీవ్రంగా విమర్శించారు. దాడులు చేసిన వారిని వదిలేసి, బాధితులపైనే కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇలాంటి దాడులతో వైసీపీ నాయకులను భయపెట్టగలమనుకుంటే మీ అంత మూర్ఖుడు లేడు. ఎల్లకాలం ఇదే ప్రభుత్వం ఉండదు. మూడేళ్లలో మా ప్రభుత్వం వస్తుంది. అప్పుడు వడ్డీతో సహా చెల్లిస్తాం' అంటూ చంద్రబాబు ప్రభుత్వానికి ఘాటు వార్నింగ్ ఇచ్చారు. చేసిన తప్పులకు చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్ లెక్కలు చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం తిరుమల నెయ్యి వివాదంపై కూడా జగన్ స్పందించారు. నెయ్యిలో ఎలాంటి కల్తీ జరగలేదని ల్యాబ్ నివేదికలు స్పష్టం చేశాయని, కేవలం తిరుమల ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే చంద్రబాబు కుట్రపూరితంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.



# వేములవాడ మున్సిపాలిటీ మాదే

**బీజేపీ జెండా ఎగురవేస్తాం.. కేంద్ర మంత్రి బండి సంజయ్**



వేములవాడ, ఫిబ్రవరి 4 (ఈవార్తలు): వేములవాడ మున్సిపాలిటీని బీజేపీ కైవసం చేసుకోవడం ఖాయమని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. నిధులు ఇచ్చేది ప్రధాని మోదీ అయితే, తెచ్చేది తానేనని అన్నారు. వేములవాడలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి చేసేది కేంద్రం అయితే ఇక్కడ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఓటు ఎందుకు వేయాలని ప్రశ్నించారు. పెన్షన్లు, నిరుద్యోగ భృతి సహా కాంగ్రెస్ ఏ హామీని అమలు చేయలేదని మండిపడ్డారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజల రక్తాన్ని పీల్చి, పిప్పి చేశారని ఆయన అన్నారు. కేంద్రం నుంచి నిధులు వస్తే కమీషన్ల రూపంలో దండుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు మళ్లీ దొంగ హామీలతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మీ ముందుకు వస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఇచ్చిన హామీలను అమలు చేయని మీకు ఎందుకు ఓటేయాలని వారిని నిలదీయాలని సూచించారు. వేములవాడ ఎమ్మెల్యే బీజేపీ కార్యకర్తలను బెదిరిస్తుంటే పోలీసులు వంతపాడుతున్నారని బండి సంజయ్ మండిపడ్డారు. మా విజ్ఞప్తిని పోలీసులు చేతకానితనంగా భావిస్తున్నారా అని మండిపడ్డారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని లేదా అని నిలదీశారు. పోలీసులు పద్ధతి మార్చుకోకపోతే వేములవాడలోనే కూర్చుంటానని, మీ డీజీపీని, ఎస్పీని ఇక్కడికి రప్పించాల్సి ఉంటుందని అన్నారు.

## గాంధీ భవన్ సమావేశాలే సాక్ష్యం

**స్పీకర్ గారూ.. ఇంకేం రుజువు కావాలి**

**జగిత్యాల ఎమ్మెల్యే వ్యవహారంపై కవిత ఫైర్**



హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఈవార్తలు): పార్టీ ఫిరాయింపుల కేసులో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ క్లీన్ చిట్ ఇవ్వడంపై మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంజయ్‌కు స్పీకర్ క్లీన్‌చిట్ ఇవ్వడం ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు అని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి బీఫామ్ తీసుకుని ఎమ్మెల్యేగా గెలుపొందిన సంజయ్ అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరింది వాస్తవం కాదా అని కవిత ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలో చేరకపోతే...కాంగ్రెస్ పార్టీతో సంబంధం లేకుంటే గాంధీభవన్‌లో జరిగే సమావేశాలకు ఎలా వెళ్తారని మాజీ ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. ఈ సాక్ష్యం సరిపోదా సంజయ్ పార్టీ మారాడు అని. ఇంతకు మించిన ఆధారాలు ఇంకేముటాయి? స్పీకర్ గడ్డం ప్రసాద్ అని మాజీ ఎమ్మెల్సీ కవిత నిలదీశారు. అంతేకాదు మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి జగిత్యాలలో తమరు క్లీన్‌చిట్ ఇచ్చిన ఎమ్మెల్యేనే కాంగ్రెస్ పార్టీ బీఫామ్‌లు ఇవ్వడం ఎంత వివాదాస్పదం అయ్యిందో లోకం అంతా చూసింది అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత చెప్పుకొచ్చారు. ఈ వ్యవహారాన్ని యావత్ లోకమంతా చూసి ఆశ్చర్యపోయిందని ఈ విషయం మీ దృష్టికి రాలేదా అని కవిత నిలదీశారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ పార్టీ మారారు అనడానికి ఆధారాలు లేవంటూ అనర్హత పిటిషన్‌ను స్పీకర్ కొట్టివేయడంపై కవిత మండిపడ్డారు. మీరు రాజ్యాంగ బద్ధమైన స్పీకర్ చైర్‌లో ఉండి కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా వ్యవహరిస్తున్నారు అని అనుకోవాల్సి వస్తుంది అని కవిత చెప్పుకొచ్చారు. అదే నిజమైతే మీరు భారత రాజ్యాంగాన్ని...చట్ట సభల ఔన్నత్యాన్ని ఎలా కాపాడగలుగుతారు అని మాజీ ఎమ్మెల్సీ కవిత నిలదీశారు.

## ఏపీలో జంగిల్ రాజ్

**మా పార్టీ నేతలపై దాడులు.. ఎన్‌హెచ్ఆర్సీని వైసీపీ ఫిర్యాదు**

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో తమ పార్టీ నేతల ఇళ్లపై జరిగిన దాడులు, ఒక దళిత కార్యకర్త హత్య ఘటనలపై వైసీపీ జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ)ని ఆశ్రయించింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా విఫలమయ్యాయని, మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ సమగ్ర విచారణ జరపాలని కోరింది. బుధవారం నాడు ఢిల్లీలో వైసీపీ బృందం ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఛైర్‌పర్సన్ జస్టిస్ వి. రామసుబ్రమణియన్‌ను కలిసి ఫిర్యాదు అందజేసింది. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేశ్ ఇళ్లపై జరిగిన దాడులతో పాటు, దళిత కార్యకర్త హత్యకు సంబంధించిన వివరాలను కమిషన్‌కు సమర్పించింది. టీడీపీ శ్రేణులు పథకం ప్రకారమే ఈ దాడులకు పాల్పడ్డాయని, ప్రతిపక్ష నేతలను భౌతికంగా అంతమొందించే ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన వీడియోలు, ఫొటోలను ఆధారాలుగా అందజేశారు. సమావేశం అనంతరం వైసీపీ నేతలు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో దళితులపై దాడులు పెరిగాయని, మాజీ మంత్రులపై పెట్రోల్ బాంబులతో దాడికి యత్నించారని మాజీ మంత్రి మేరుగు నాగార్జున ఆవేదన వ్యక్తం చేశారు. దాడులు జరుగుతున్న సమయంలో పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారని, రాష్ట్రంలో రాజ్యాంగ వ్యవస్థ బలహీనపడిందని ఆదిమూలపు సురేష్ విమర్శించారు. కొందరు నేతలు రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. తమ ఫిర్యాదుపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఛైర్‌పర్సన్ సానుకూలంగా స్పందించారని వైసీపీ నేతలు తెలిపారు. ఏపీ డీజీపీ నుంచి నివేదిక కోరడంతో పాటు, వాస్తవాలను తెలుసుకునేందుకు ఒక నిజనిర్ధారణ బృందాన్ని రాష్ట్రానికి పంపే అవకాశం ఉందని వారు వెల్లడించారు. ఈ బృందంలో ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, మిథున్ రెడ్డి, గురుమూర్తి, మాజీ మంత్రులు తదితరులు ఉన్నారు. హత్యకు గురైన దళిత కార్యకర్త సల్మాన్ సోదరుడు కూడా తమ గ్రామంలో శాంతిని కాపాడాలని కమిషన్‌ను కోరారు.




# సీఐఎఫ్ఏ కృషి భేష్

## మత్స్యరంగ అభివృద్ధిలో కీలక పాత్ర.. తెలంగాణ మీడియా ప్రతినిధుల కితాబు.. భువనేశ్వర్‌లోని సీఐఎఫ్ఏ సందర్శన

భువనేశ్వర్, ఫిబ్రవరి 4 (పీఐబీ): దేశంలో మత్స్యరంగ అభివృద్ధికి సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్రెష్‌వాటర్ ఆక్వాకల్చర్ (సీఐఎఫ్ఏ) గొప్పగా కృషి చేస్తోందని పీఐబీ నేతృత్వంలోని తెలంగాణ మీడియా ప్రతినిధుల బృందం కొనియాడింది. ఒడిశా పర్యటనలో భాగంగా మూడో రోజు భువనేశ్వర్‌లోని సీఐఎఫ్ఏను సందర్శించిన మీడియా బృందానికి సంస్థ డైరెక్టర్ డాక్టర్ ప్రమోద్ కుమార్ సాహు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన సంస్థ లక్ష్యాలు, ప్రధాన పరిశోధనలు, దేశంలో మంచి నీటి చేపల పెంపక రంగ అభివృద్ధిలో సంస్థ పోషిస్తున్న కీలక పాత్ర గురించి వివరించారు. ఈ చర్చా కార్యక్రమంలో భాగంగా సంస్థకు చెందిన శాస్త్రవేత్తలు వ్యాధి నిరోధక శక్తి కలిగిన చేపల పెంపకం, జన్యుపరమైన అభివృద్ధి కార్యక్రమాలు, సుస్థిర ఆక్వాకల్చర్ పద్ధతుల్లో వస్తున్న పురోగతి గురించి పలు విషయాలను పంచుకున్నారు. దీని తర్వాత క్షేత్రస్థాయి సందర్శన చేపట్టిన మీడియా ప్రతినిధులు.. చేపల పునరుత్పత్తి, పెంపకానికి సంబంధించిన పూర్తి ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. సంస్థలోని బయోఫ్లోక్ యూనిట్, అలంకార చేపల హ్యాచరీ సముదాయం, గాలిని పీల్చుకునే చేపల హ్యాచరీ సముదాయం వంటి పలు విభాగాలను సందర్శించింది. ఆధునిక హ్యాచరీ నిర్వహణ పద్ధతులు, తక్కువ నీటి వినియోగంతో కూడిన ఆక్వాకల్చర్ వ్యవస్థలు, ఉపాధి ఆధారిత సాంకేతికతలను శాస్త్రవేత్తలు వివరించారు. బయోఫ్లోక్ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించిన శాస్త్రవేత్తలు.. చేపల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, దాణా ఖర్చును తగ్గించడం, రైతులకు ఉత్పాదకతను పెంచడంలో ఇది ఎలా తోడ్పడుతుందో వివరించారు. భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐకార్) ఆధ్వర్యంలో సీఐఎఫ్ఏ పనిచేస్తోంది. సామర్థ్య పెంపు, క్షేత్రస్థాయి ప్రదర్శనలు, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ ద్వారా సుస్థిరమైన ఆక్వాకల్చర్‌ను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తోన్న ఈ సంస్థ.. రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు దేశ ఆహార భద్రత విషయంలో విశేష కృషి చేస్తోంది. 'సీఐఎఫ్ఏ'కు చెందిన ఎఫ్‌జీబీ విభాగాధిపతి డాక్టర్ జే. కే. సుందరాయ్, ఏపీఈ విభాగాధిపతి డాక్టర్ పీ.సీ. దాస్ సమన్వయంతో ఈ సందర్శన విజయవంతమైంది. సీఐఎఫ్ఏ శాస్త్రవేత్తల కృషిని మీడియా ప్రతినిధులు అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలు పరిశోధనా సంస్థలకూ, ప్రజలకు మధ్య ఉన్న అనుబంధాన్ని మరింత బలోపేతం చేయడంలో సహాయపడతాయని పేర్కొన్నారు.

# రాహుల్ గాంధీ దేశ ద్రోహి

## కేంద్రమంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు

న్యూఢిల్లీ: లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై కేంద్ర మంత్రి, మాజీ కాంగ్రెస్ నేత రవ్‌నీత్ సింగ్ బిట్టు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పార్లమెంట్ ప్రాంగణంలో తనను 'దేశద్రోహి' అని సంబోధించిన రాహుల్, ఒక వీధి రౌడీలా ప్రవర్తించారని, తనపై భౌతిక దాడికి కూడా ప్రయత్నించారని సంచలన ఆరోపణలు చేశారు. ఈ ఘటనతో పార్లమెంట్ వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. బుధవారం పార్లమెంట్ ప్రధాన ద్వారం నుంచి వెళు్తన్న సమయంలో సస్పెండైన ఎంపీలతో కలిసి ఉన్న రాహుల్ గాంధీ, తనను చూసి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని రవ్‌నీత్ సింగ్ బిట్టు తెలిపారు. "అదిగో దేశద్రోహి వెళ్తున్నాడు. అతని ముఖం చూడండి" అంటూ రాహుల్ గట్టిగా అరిచారని చెప్పారు. అంతటితో ఆగకుండా, "హలో సోదరా, నా దేశద్రోహి మిత్రమా. కంగారు పడకు, నువ్వు మళ్లీ కాంగ్రెస్‌లోకి తిరిగి వస్తావులే" అని తనతో అన్నారని బిట్టు వివరించారు. రాహుల్ వ్యాఖ్యలకు తాను తీవ్రంగా ప్రతిస్పందించానని బిట్టు తెలిపారు. "రాహుల్ ఇంకా ఏదో సంస్థానానికి యువరాజుననే అపోహలో ఉన్నట్టున్నారు. నేను




ఆయనతో కరచాలనం చేస్తానని అనుకున్నారు. కానీ నేను, 'రాహుల్ జీ, మీరే ఈ దేశానికి శత్రువు. మీరు సైనికులకు వ్యతిరేకి, పార్లమెంటులో ఎప్పుడూ వారికి వ్యతిరేకంగానే మాట్లాడతారు' అని స్పష్టంగా చెప్పాను" అని బిట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ తనపై భౌతిక దాడికి యత్నించారని బిట్టు ఆరోపించారు. "నేను కరచాలనం చేసేందుకు నిరాకరించగానే, రాహుల్ నాపైకి దూసుకొచ్చారు. వెంటనే కేసీ వేణుగోపాల్ అడ్డుకుని ఆయన్ను వెనక్కి తీసుకెళ్లారు. వేణుగోపాల్ గనుక అడ్డుకోకపోయి ఉంటే, రాహుల్ నాపై దాడి చేసేవారే. ఒకవేళ దాడి చేసి ఉంటే, నేను కూడా ఊరుకునేవాడిని కాదు" అని బిట్టు హెచ్చరించారు. వీధి రౌడీలు కూడా చేయని పనిని రాహుల్ చేశారని ఆయన మండిపడ్డారు. గాంధీ కుటుంబంపై, కాంగ్రెస్ పార్టీపై కూడా బిట్టు తీవ్ర విమర్శలు చేశారు. "సిక్కుల హంతకులైన గాంధీ కుటుంబ వారసుడితో ఒక సర్దార్ ఎప్పటికీ చేయి కలపడు. కాంగ్రెస్ పార్టీ ఎంతో మంది సిక్కులను చంపింది. గురుద్వారాలను ధ్వంసం చేసింది. వారు ఎప్పటికీ మాకు శత్రువులే" అని అన్నారు. తన తాత, పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి బియాంత్ సింగ్ దేశం కోసం ప్రాణత్యాగం చేశారని, అయితే ఆయన కీర్తిని చూసి గాంధీ కుటుంబం ఓర్వలేకపోయిందని ఆరోపించారు. పీవీ నరసింహారావు ప్రధాని అయ్యాక గాంధీ కుటుంబ పాలన అంతమైందని, పరిస్థితులు మారాయని గుర్తుచేశారు. ఒక పార్లమెంటేరియన్ అయి ఉండి ఇలాంటి పదజాలం వాడటం, దాడికి యత్నించడం రాహుల్ గాంధీకి తగదని బిట్టు హితవు పలికారు. "ప్రస్తుతం నేను ఉన్న బీజేపీలో ప్రధాని మోదీ, అమిత్ షా నాకు ఎంతో గౌరవం ఇస్తున్నారు. రాజకీయాల్లో వ్యక్తిగత దూషణలకు తావులేదు. ఈ ఘటన పార్లమెంట్ ఆవరణలో జరగడం వల్లే అసలు విషయం అందరికీ తెలిసింది" అని రవ్‌నీత్ సింగ్ బిట్టు వ్యాఖ్యానించారు.

## పొగాకే అతిపెద్ద శత్రువు

### దానివల్లే 15 శాతం క్యాన్సర్లు.. ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడి



జెనీవా: ప్రపంచవ్యాప్తంగా ప్రతి 10 క్యాన్సర్ కేసుల్లో దాదాపు 4 కేసులను నివారించవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ), దాని అనుబంధ అంతర్జాతీయ క్యాన్సర్ పరిశోధన ఏజెన్సీ (ఐఏఆర్సీ) సంచలన నివేదికను వెల్లడించాయి. దీని ప్రకారం, ఏటా నమోదయ్యే కేసుల్లో సుమారు 71 లక్షల క్యాన్సర్లకు మన జీవనశైలి, అలవాట్లే కారణమని తేలింది. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా బుధవారం ఈ అధ్యయనాన్ని విడుదల చేశారు. 2022 నాటి గణాంకాల ప్రకారం, క్యాన్సర్ విషయంలో పొగాకు వాడకం అతి పెద్ద దోషిగా నిలిచింది. మొత్తం కేసుల్లో 15 శాతం పొగాకు వల్లే వస్తున్నాయని గుర్తించారు. దీని తర్వాత 9 రకాల ఇన్ఫెక్షన్లు 10 శాతం క్యాన్సర్లకు కారణమవుతున్నాయని తొలిసారిగా ఈ అధ్యయనంలో తేల్చారు. మద్యపానం, అధిక బరువు, శారీరక శ్రమ లేకపోవడం, వాయు కాలుష్యం, అతినీలలోహిత కిరణాల ప్రభావం వంటివి ఇతర ప్రధాన కారణాలుగా ఉన్నాయి. 185 దేశాల నుంచి 36 రకాల క్యాన్సర్లపై సేకరించిన సమాచారంతో ఈ విశ్లేషణ చేశారు. ఊపిరితిత్తులు, కడుపు, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లు.. ఈ మూడు రకాలే నివారించదగిన క్యాన్సర్లలో దాదాపు సగం వాటాను కలిగి ఉన్నాయి. పొగతాగడం, కాలుష్యం వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్; హెలికోబాక్టర్ పైలోరీ ఇన్ఫెక్షన్ వల్ల కడుపు క్యాన్సర్; హ్యూమన్ పాపిలోమావైరస్ (హెచ్‌పీవీ) వల్ల గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వస్తున్నట్లు గుర్తించారు. "నివారించగల కారణాల వల్ల ఎంత క్యాన్సర్ ముప్పు ఉందో చూపించే మొట్టమొదటి ప్రపంచ విశ్లేషణ ఇది" అని డబ్ల్యూహెచ్ఓ క్యాన్సర్ కంట్రోల్ టీమ్ లీడ్, అధ్యయన రచయిత డాక్టర్ ఇల్బావి తెలిపారు. మహిళలతో (30 శాతం) పోలిస్తే పురుషుల్లో (45 శాతం) నివారించదగిన క్యాన్సర్ల భారం గణనీయంగా ఎక్కువగా ఉందని నివేదిక పేర్కొంది. పొగాకు నియంత్రణ, హెచ్ పీవీ వ్యాక్సిన్లు, ఆరోగ్యకరమైన జీవనశైలి ద్వారా ఈ ముప్పును తగ్గించుకోవచ్చని అధ్యయనం సూచించింది.

# అజిత్ ఎన్సీపీ కలిసిపోవాలనుకున్నారు

**ఫడ్నవీస్‌కు శరద్ పవార్ కౌంటర్**

ముంబై: ఎన్సీపీ రెండు వర్గాల విలీన చర్చల్లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పాల్గొనలేదని, కాబట్టి ఈ అంశంపై ఆయనకు మాట్లాడే హక్కు లేదని ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ అన్నారు. బారామతి విమాన ప్రమాదంలో ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. శరద్ పవార్, అజిత్ పవార్ మధ్య విలీన చర్చలు జరిగాయని ప్రచారం జరిగింది. అయితే ఈ ప్రచారాన్ని ఎన్సీపీ (అజిత్ పవార్) పార్టీ కొట్టిపారేసింది. అజిత్ పవార్ అన్ని విషయాలను తనతో చర్చించేవారని, పార్టీ విలీనం నిజమే అయితే ఎన్డీయేను వీడేవారని ముఖ్యమంత్రి ఫడ్నవీస్ అన్నారు. కానీ ఆయన మరణానంతరం పార్టీ విలీనం అంటూ ప్రచారం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై శరద్ పవార్ స్పందిస్తూ, ఎన్సీపీ రెండు వర్గాల విలీనంపై అజిత్ పవార్ సానుకూలంగా ఉండేవారని అన్నారు. తమ పార్టీ అధ్యక్షుడు జయంత్ పాటిల్‌తో చర్చలు కూడా జరుపుతున్నారని తెలిపారు. ఈ చర్చల్లో ముఖ్యమంత్రి పాల్గొనలేదని వ్యాఖ్యానించారు. అలాంటప్పుడు ఈ అంశంలో జోక్యం చేసుకునే హక్కు ముఖ్యమంత్రికి ఎక్కడిదని ప్రశ్నించారు. ఉప ముఖ్యమంత్రిగా సునేత్రా పవార్ బాధ్యతలు స్వీకరించడాన్ని స్వాగతిస్తున్నట్లు శరద్ పవార్ తెలిపారు. ప్రస్తుతం రాజకీయాలపై చర్చించే సమయం కాదని అన్నారు.

# న్యాయం ఏడుస్తోంది

## ఈసీపై మమత సుప్రీం కోర్టులో పిటిషన్.. తన పిటిషన్ పై తానే వాదనలు

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సుప్రీంకోర్టులో ఎన్నికల సంఘం (ఈసీఐ)పై తీవ్రంగా విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఓటర్ లిస్ట్‌పై సవాలు చేస్తూ ఆమె దాఖలు చేసిన పిటిషన్‌పై సీజేఐ సూర్యకాంత్ ముందు వాదనలు జరిగాయి. "న్యాయం తలుపుల వెనక ఏడుస్తోంది" అంటూ మమత గట్టిగా అరిచారు. తాను మాట్లాడేందు ఐదు నిమిషాల సమయం ఇవ్వాలని కోరగా సీజేఐ అంగీకరించారు. 15 నిమిషాల పాటు మాట్లాడే అవకాశం ఇచ్చారు. మమత తన వాదన మొదలు పెడుతూనే ఈసీఐపై మాటల దాడి చేశారు. ఆరు సార్లు లేఖలు రాశాను కానీ ఒక్క స్పందన రాలేదని, ఎక్కడా న్యాయం దొరకడం లేదని ఆరోపించారు. భాషా సమస్యలు, స్పెల్లింగ్ మిస్‌మ్యాచ్‌ల వల్ల మాత్రమే ఓటర్లను తొలగించకూడదని వాదించారు. వివాహం తర్వాత ఇంటి పేరు మారిన మహిళల పేర్లను తొలగించారని తెలిపారు. ఆధార్‌ను ఆమోదించకపోవడం కోర్టు ఆదేశాల ఉల్లంఘన అని... ఇతర రాష్ట్రాల్లో డొమిసైల్, కుల సర్టిఫికెట్లు అంగీకరిస్తుంటే బెంగాల్‌ను మాత్రమే టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు 3 నెలల్లో ఎందుకు ఇంత హడావుడి? నాలుగు రాష్ట్రాల్లో ఎన్నికలు ఉంటే ఎందుకు బెంగాల్‌ను మాత్రమే ఎంచుకున్నారు? అని ప్రశ్నించారు. బూత్ లెవల్ ఆఫీసర్ల మరణాలకు ఎస్ఐఆర్‌తో సంబంధం ఉందని, హార్వెస్టింగ్ సీజన్‌లో 100 మందికి పైగా మరణాలు, హాస్పిటలైజేషన్లు జరిగాయని, అసోంలో ఎందుకు ఇలాంటివి



లేవని విమర్శించారు. బెంగాల్‌ను "బుల్డోజ్" చేస్తున్నారని, ప్రజల హక్కులను కాపాడాలని ధర్మాసనాన్ని కోరుతున్నానని అన్నారు. జస్టిస్ జోయ్ మాల్య బాగ్చి, వీఎం పంచోలి బెంచ్ మమతా పిటిషన్ జెన్యూన్ అని అంగీకరించింది. ఎస్ఐఆర్ నోటీసులు పంపేటప్పుడు అధికారులు కాస్త సెన్సిబుల్‌గా ఉండాలని ఈసీకి సూచించింది. అమర్త్యా సేన్, జాయ్ గోస్వామి, టీఎంసీ ఎంపీ దీపక్ అధికారి వంటి ప్రముఖులకు నోటీసులు పంపడం గురించి ఆందోళన వ్యక్తం చేసింది. తదుపరి విచారణ సోమవారానికి వాయిదా వేసింది. మరోవైపు, మమత కోల్ కతాలోని జోగేశ్ చంద్ర చౌదరి కాలేజీ నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి సుప్రీంకోర్టులో సొంతంగా వాదనలు వినిపించడం ఇదే తొలిసారి.

## 2.5 కోట్ల ఆధార్‌లు డీయాక్టివేట్

న్యూఢిల్లీ: గుర్తింపు మోసాలను అరికట్టే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. దేశవ్యాప్తంగా మరణించిన 2.5 కోట్లకు పైగా వ్యక్తుల ఆధార్ నంబర్లను డీయాక్టివేట్ చేసినట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద బుధవారం పార్లమెంటుకు తెలిపారు. ఆధార్ డేటాబేస్ కచ్చితత్వాన్ని, సమగ్రతను కాపాడేందుకు దేశవ్యాప్తంగా చేపట్టిన శుద్ధీకరణ కార్యక్రమంలో భాగంగా ఈ చర్యలు తీసుకున్నట్లు ఆయన వివరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద బయోమెట్రిక్ గుర్తింపు వ్యవస్థ అయిన ఆధార్ సుమారు 134 కోట్ల మంది వినియోగదారులను కలిగి ఉంది. మరణించిన వారి ఆధార్ నంబర్లను దుర్వినియోగం చేసి సంక్షేమ పథకాలను పొందడం, ఇతర మోసాలకు పాల్పడటం వంటివి నిరోధించడానికి ఈ డీయాక్టివేషన్ ప్రక్రియ చాలా అవసరమని మంత్రి పేర్కొన్నారు. ఆధార్ దుర్వినియోగాన్ని తగ్గించడానికి భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ అనేక భద్రతా చర్యలు




తీసుకుంటున్నట్లు జితిన్ ప్రసాద తెలిపారు. ఇందులో భాగంగా వినియోగదారులు తమ బయోమెట్రిక్స్‌ను లాక్/అన్‌లాక్ చేసుకునే సదుపాయం, లావాదేవీల సమయంలో లబ్ధిదారు భౌతికంగా ఉన్నట్లు నిర్ధారించే 'లైవ్‌నెస్ డిటెక్షన్' ఫీచర్‌తో కూడిన ఫేస్ అథెంటికేషన్, ఆధార్ సెక్యూర్ క్యూఆర్ కోడ్, ఆఫ్‌లైన్ ఈ-కేవైసీ వంటివి అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. వినియోగదారుల ప్రధాన బయోమెట్రిక్ సమాచారాన్ని యూఐడీఏఐ ఎవరితోనూ పంచుకోదని, డేటాను ఎన్‌క్రిప్టెడ్ ఫార్మాట్‌లో భద్రపరచడం తప్పనిసరి చేసిందని ఆయన స్పష్టం చేశారు.



## మణిపూర్ సీఎంగా ఖేమ్‌చంద్ ప్రమాణం

ఇంఫాల్: మణిపూర్ ముఖ్యమంత్రిగా బీజేపీ నాయకుడు వై ఖేమ్‌చంద్ సింగ్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. 62 ఏండ్ల బీజేపీ శాసనసభ్యుడైన ఖేమ్‌చంద్ చేత గవర్నర్ అజయ్ కుమార్ భల్లా ప్రమాణం చేయించారు. ఆయనతోపాటు ఉప ముఖ్యమంత్రులుగా కుకీ తెగకు చెందిన ఎమ్మెల్యే ఏ నేంచా కిన్‌జెన్, నాగా పీపుల్స్ ఫ్రంట్ ఎమ్మెల్యే ఎల్ దిఖో కూడా ప్రమాణం చేశారు. బీజేపీకి చెందిన ఎమ్మెల్యే గోవిందాస్ కొంతౌజమ్, ఎన్‌పీపీకి చెందిన కే లోకేన్ సింగ్ మంత్రులుగా ప్రమాణం చేశారు. ఢిల్లీలోని మణిపూర్ భవన్ నుంచి వర్చువల్ పద్ధతిలో కిన్‌జెన్ ప్రమాణం చేశారు. అంతకుముందు రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనను తొలగించారు.


# లోక్‌సభలో గందరగోళం

## ప్రతిపక్షాల భారీ నిరసన.. నేడు ప్రధాని మోదీ ప్రసంగం

న్యూఢిల్లీ: లోక్‌సభలో ప్రతిపక్షాలు బుధవారం భారీ నిరసన చేపట్టాయి. స్పీకర్ పోడియంతోపాటు ప్రధాని మోదీ కూర్చునే సీటు వద్దకు పలువురు ఎంపీలు వచ్చి ఆందోళన చేశారు. అందులోనూ కాంగ్రెస్ పార్టీకి చెందిన మహిళా ఎంపీలు కూడా ఈ ఆందోళనలో పాల్గొన్నారు. విపక్షాల ఆందోళన మధ్య సభ వాయిదా పడింది. దీంతో ప్రధాని మోదీ ధన్యవాద ప్రసంగం కూడా వాయిదా పడినట్లైంది. షెడ్యూల్ ప్రకారం నేటి సాయంత్రం ప్రధాని మోదీ సభలో మాట్లాడాలి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రసంగించాల్సి ఉంది. అయితే, సాయంత్రం ఐదు గంటల తర్వాత సభ ప్రారంభంకాగానే విపక్ష ఎంపీలు ఆందోళనకు దిగారు. దీంతో సభ గురువారానికి వాయిదా పడింది. ప్రధాని ప్రసంగం కూడా రేపే ఉండే అవకాశం ఉంది. సభలో రాహుల్ గాంధీ ఒక పుస్తకం గురించి ప్రస్తావిస్తున్న సంగతి తెలిసిందే. భారత సైన్య మాజీ అధిపతి ఎంఎం నరవాణే రచించిన పుస్తకంలోని కొన్ని అంశాల్ని చదివేందుకు ఆయన ప్రయత్నించగా.. ఇందుకు స్పీకర్ అనుమతించలేదు. దీంతో రాహుల్ సహా, కాంగ్రెస్ ఎంపీలు సభలో నిరసనకు దిగారు. బుధవారం ఉదయం నుంచి వారి నిరసన కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో సభ పలుమార్లు వాయిదాపడింది. మరోవైపు రాహుల్ గాంధీ ఈ రోజు ఉదయం మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ సభకు వస్తే.. ఈ పుస్తకాన్ని తానే ఆయనకు అందిస్తానని, అయితే, ఆయన సభలోకి వస్తారని అనుకోవడం లేదని అన్నారు. ఇదే సమయంలో రాహుల్ గాంధీకి, కేంద్ర మంత్రి రవనీత్ సింగ్ బిట్టుకు మధ్య పార్లమెంట్ ప్రాంగణంలో చిన్న వాగ్వాదం జరిగింది. రవనీత్‌ను ద్రోహి స్నేహితుడు అంటూ రాహుల్ అభివర్ణించారు. దీనికి ఆయన కూడా గట్టిగానే బదులిచ్చారు.

## ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లలో రెండు రోజుల లాభాలకు బుధవారం బ్రేక్ పడింది. ఐటీ రంగ షేర్లలో భారీ అమ్మకాల ఒత్తిడి నెలకొనడంతో సూచీలు దాదాపు ఫ్లాట్‌గా ముగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 78.56 పాయింట్ల స్వల్ప లాభంతో 83,817.69 వద్ద, నిఫ్టీ 48.45 పాయింట్లు పెరిగి 25,776.00 వద్ద స్థిరపడ్డాయి. కృత్రిమ మేధ (ఏఐ) టెక్నాలజీలో వేగంగా వస్తున్న పురోగతిపై నెలకొన్న కొత్త ఆందోళనలు పెట్టుబడిదారుల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఏఐ స్టార్టప్ ఆంత్రోపిక్ న్యాయవాదుల కోసం ఒక కొత్త టూల్‌ను ప్రారంభించడమే ఇందుకు కారణం. ఇలాంటి ఏఐ టూల్స్ వేగంగా అభివృద్ధి చెందడం వల్ల సంప్రదాయ సాఫ్ట్‌వేర్ సేవలకు డిమాండ్ తగ్గి, ఐటీ పరిశ్రమ లాభదాయకత దెబ్బతినవచ్చని ఇన్వెస్టర్లు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రభావంతోనే నిఫ్టీ ఐటీ ఇండెక్స్ ఏకంగా 6 శాతం కుప్పకూలింది. సెన్సెక్స్ స్టాక్స్‌లో ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్‌టెక్, టెక్ మహీంద్రా షేర్లు ప్రధాన నష్టాల్లో ముగిశాయి. యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు కూడా నష్టపోయాయి. మరోవైపు, ఎటర్నల్, ట్రెంట్, ఎన్టీపీసీ, పవర్ గ్రిడ్,



అదానీ పోర్ట్స్ షేర్లు లాభపడ్డాయి. రంగాల వారీగా చూస్తే, ఐటీతో పాటు ఫార్మా ఇండెక్స్ కూడా 0.34 శాతం నష్టపోయింది. అయితే, నిఫ్టీ కన్స్యూమర్ డ్యూరబుల్స్ ఇండెక్స్ 2.6 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ ఇండెక్స్ 2 శాతం పెరిగి మార్కెట్లకు మద్దతునిచ్చాయి. ప్రధాన సూచీలు ఫ్లాట్‌గా ఉన్నప్పటికీ, బ్రాడర్ మార్కెట్‌లో సానుకూల వాతావరణం కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.63 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.27 శాతం లాభపడ్డాయి. నిపుణుల ప్రకారం, నిఫ్టీ రోజంతా 25,680 - 25,820 మధ్య పరిమిత శ్రేణిలో కదలాడింది. 25,800 స్థాయిని దాటితేనే సూచీలో మరింత సానుకూలత రావచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ప్రభుత్వాలు శాశ్వతం కాదు: కమల్

న్యూఢిల్లీ: ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యం అధినేత కమల్ హాసన్ రాజ్యసభలో తన తొలి ప్రసంగంతో ఆకట్టుకున్నారు. బుధవారం నాడు బడ్జెట్ సమావేశాల్లో భాగంగా రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. ఏ ప్రభుత్వమూ శాశ్వతం కాదని, అధికారం ఎవరికీ శాశ్వతం కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని ఆయన హితవు పలికారు. 'వివిధ రంగాలకు చెందిన వారు తమ ప్రజల తరఫున మాట్లాడేందుకు ఈ సభలోకి ప్రవేశించడానికి అనేక ద్వారాలు తెరుచుకుంటాయి. నాకు మాత్రం సినిమా ద్వారా ఆ ద్వారం తెరుచుకుంది' అని కమల్ హాసన్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. తనకు మద్దతిచ్చిన తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పెరియార్, సి.ఎన్. అన్నాదురై, మహాత్మా గాంధీ వంటి మహనీయుల ప్రభావం తన ఆలోచనలు, రాజకీయాలపై ఉందని పేర్కొన్నారు. 'మా భాష, సంస్కృతి, హక్కులపై ఎలాంటి దాడి జరిగినా ఎదుర్కోవాలని నేర్పిన సి.ఎన్. అన్నాదురై నాకు తమిళాన్ని పరిచయం చేశారు' అని కమల్ గుర్తుచేసుకున్నారు.



ఈవార్తలు
# వినోదవాణి CINEMA
గురువారం 5-2-2026 | www.evarthalu.com | 6


వయ్యారి చిత్రం



## మార్చి 26న ఉస్తాద్ రిలీజ్

పవన్ కళ్యాణ్– హరీష్ శంకర్ కలయికలో వస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్'. ఈ సినిమాను మార్చి 26, 2026న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. నిజానికి ఆ తేదీన రామ్ చరణ్ నటించిన 'పెద్ది' సినిమా విడుదల కావాల్సి ఉంది. కానీ ఆ మూవీ వాయిదా పడటంతో ఆ ఖాళీని బాబాయ్ పవన్ కళ్యాణ్ భర్తీ చేయబోతున్నారని తెలుస్తోంది. అంటే మూవీ టీమ్ అనుకున్నట్లుగానే మార్చిలో ఉస్తాద్ థియేటర్స్‌లోకి రాబోతున్నాడన్న మాట. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. దేవి శ్రీ ప్రసాద్ అందించే సంగీతం ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందట. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌లో పవన్ కళ్యాణ్ స్వాగ్ చూసిన అభిమానులు, థియేటర్లలో పూనకాలు రావడం పక్కా అని ఫిక్స్ అయ్యారు.






## పెద్ది వాయిదా..

పెద్ది వాయిదా అంటూ వస్తున్న వార్తలకు చెక్ పడింది. అందరూ అనుకున్నట్లే పెద్ది సినిమా వాయిదా పడింది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, జాన్వీ కపూర్ జంటగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం పెద్ది. వృద్ధి సినిమాస్ బ్యానర్ పై సతీష్ కిలారు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇక ఈ సినిమాలో కన్నడ స్టార్ హీరో శివన్న, బాలీవుడ్ యంగ్ ఆర్టిస్ట్ దివ్యేందు శర్మ, జగపతి బాబు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన ఫస్ట్ షాట్, చికిరి చికిరి సాంగ్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మొదటి నుంచి పెద్ది రామ్ చరణ్ పుట్టినరోజు కానుకగా మార్చి 27 న రిలీజ్ కానుందని మేకర్స్ ప్రకటించారు. అందుకు తగ్గట్లుగానే షూటింగ్, ప్రమోషన్స్ అన్ని సెట్ చేసుకున్నారు. కానీ, కొన్ని కారణాల వలన ఈ సినిమా వాయిదా పడుతోందని ఎప్పటినుంచో వార్తలు వస్తున్నాయి. తాజాగా ఆ వార్తలు నిజమే అన్నట్లు మేకర్స్ కూడా ఆపెద్ది మార్చి 27 న రావడం లేదని అధికారికంగా ప్రకటించారు. మార్చి 27 నుంచి తప్పుకొని ఏప్రిల్ 30 న పెద్ది రిలీజ్ కానుందనికొత్త డేట్ ను కూడా అనౌన్స్ చేశారు.

## మనోళ్లు డల్.. పక్కోళ్లు ఫుల్!



రామ్ చరణ్, ఎన్టీఆర్, ప్రభాస్, బన్నీ లాంటి స్టార్లు మొదలు చిరంజీవి, బాలయ్య, వెంకటేష్, నాగార్జున లాంటి సీనియర్ల వరకు అంతా ఏడాదికో, రెండేళ్లకో ఒక సినిమా చేస్తున్నారు. శర్వానంద్, నాని, అఖిల్, రామ్, విజయ్ దేవరకొండ, నితిన్ లాంటి టైర్ 2 హీరోలు కూడా సినిమా విషయంలో జాప్యం చేస్తున్నారు. ఇలా తెలుగు హీరోలు.. గ్యాప్ తీసుకోవడంతో పర భాషల హీరోలకు మన మార్కెట్‌లో లైన్ క్లియర్ అవుతోంది. ఉంటుంది. దుల్కర్ సల్మాన్ , ధనుష్, శివకార్తికేయన్, కార్తీ లాంటి స్టార్లు టాలీవుడ్‌లో దూసుకుపోతున్నారు. దుల్కర్ సల్మాన్, ధనుష్ లాంటి వారు తెలుగులో వేగంగా స్టార్స్ గా ఎస్టాబ్లిష్ అయ్యారంటే కారణం వారి కథల ఎంపికతో పాటు, టాలీవుడ్ హీరోల అలసత్వం కూడా ఓ కారణంగా వైరల్ అవుతోంది. తెలుగు హీరోల రిలీజ్ గ్యాప్ లో ఆయా హీరోల చిత్రాలు రిలీజ్ అవ్వడం, అవి సక్సెస్ అవ్వడంతో ఫ్యాన్ బేస్ ఏర్పడుతోంది.



## నా జీవితానికి అది చాలు: మీనాక్షి చౌదరి



టాలీవుడ్ లక్కీ హీరోయిన్‌గా పేరు తెచ్చుకున్న మీనాక్షి చౌదరి ఫుడ్ విషయంలో ఎలాంటి నిబంధనలు వద్దంటోంది. రీసెంట్‌గా ఆమె ఫుడ్ గురించి మాట్లాడిన వీడియో తెగ వైరల్ అవుతోంది. రీసెంట్‌గా మీనాక్షి ఓ పార్టీకి వెళ్లగా, అక్కడ తీసిన వీడియో బయటికొచ్చింది. ఈ వీడియోలో మీనాక్షి సెలబ్రిటీలాగా కాకుండా అందరిలాగానే చాలా నేచురల్ గా భోజనం చేస్తూ కనిపించారు. అంతేకాదు, భోజనం చేస్తూ మీనాక్షి చెప్పిన మాటలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఆ వీడియోలో మీనాక్షి, లైఫ్ లో స్ట్రెస్ ఇదంతా ఏమీ వద్దు, ఓన్లీ ఫుడ్డు అని నవ్వుతూ చెప్పగా, వీడియో తీస్తున్న వ్యక్తి ఇది ఈ డికేడ్‌లోనే బెస్ట్ మోటివేషనల్ వీడియో అంటుంటే, కాదు, సెంచరీ అంటూ మీనాక్షి మళ్లీ తినడం కంటిన్యూ చేయడంతో ఈ వీడియో అందరినీ తెగ ఎట్రాక్ట్ చేస్తోంది.

## సాయిపల్లవికి ట్యాలెంటే సమస్య?



హీరోల్ని డామినేట్ చేస్తోంది అన్న కారణంగా చాలా మంది డైరెక్టర్లు సాయిపల్లవిని కావాలనే దూరం పెడుతున్నట్లు ఓ చర్చ జరుగుతోంది. ప్రముఖంగా టాలీవుడ్ లో అవకాశాలు రాకపోవడానికి ఇదే అసలైన కారణంగా మాట్లాడుకుంటున్నారు. మరి ఇందులో నిజమెంత? అంటే కొంత వరకూ వాస్తవం ఉంది. లవ్ స్టోరీ చిత్రంలో నాగచైతన్య కు జోడీగా నటించింది. అందులో చైతన్య పాత్రను డామినేట్ చేసింది. సినిమాలో చైతన్య పాత్ర కంటే సాయి పల్లవి పాత్రకే మంచి క్రెడిట్ దక్కింది. అదనంగా సాయి పల్లవి మంచి డాన్సర్ కావడం కలిసొచ్చిన అంశం. తనలో ఈ స్కిల్ ని దర్శకుడు శేఖర్ కమ్ములా తెలివిగా సద్వినియోగం చేసుకున్నాడు. డాన్సులో తానో ప్రోఫెషనల్ అని నాగచైతన్య స్వయంగా ప్రశంసించాడు. ఆ సినిమాలో ప్రధానంగా హైలైట్ అయిన సన్నివేశాలు కూడా అవే. సాయి పల్లవి తొలి తెలుగు చిత్రం ఫిదా తోనే తానో ప్రోఫెషనల్ డాన్సర్ గా ప్రూవ్ చేసుకుంది. విరాట పర్వం లాంటి చిత్రంలోనూ సాయి పల్లవి పెర్ఫార్మెన్స్ అంతే గొప్పగా ఉంటుంది. రానా పాత్రని సైతం డామినేట్ చేసినట్లే ఉంటుంది. అమరన్, గార్గి, ఎన్జీకే, తండేల్ లాంటి చిత్రాల్లో అంతే బలమైన పాత్రలతో తనదైన ముద్ర వేసింది. ఈ సినిమాల తర్వాతే అమ్మడు తెలుగు, తమిళ సినిమాలకు దూరమైంది. ప్రస్తుతం బాలీవుడ్ చిత్రాలతో బిజీగా ఉంది. రామాయణంలో సీత పాత్రకు ఏరికోరి మరీ నితీష్ తివారీ ఆమెను ఎంపిక చేసాడు.. అంటే ఆమె ప్రతిభకు తార్కాణమది.

## పోలీస్ స్టేషన్ మెట్లెక్కిన ఈషా రెబ్బా

టాలీవుడ్ బ్యూటీ ఈషా రెబ్బకు చేదు అనుభవం ఎదురైంది. తనపై జరుగుతున్న అసభ్యకర దాడులను మౌనంగా భరించకుండా, ధైర్యంగా పోలీసులను ఆశ్రయించింది. గత కొన్ని రోజులుగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఈషా రెబ్బ పోస్ట్ చేసే ఫొటోలు, వీడియోల కింద ఒక వ్యక్తి వరుసగా అత్యంత అసభ్యకరమైన కామెంట్స్ చేస్తున్నట్లు ఆమె గుర్తించారు. సాధారణంగా సెలబ్రిటీలు ఇలాంటి నెగెటివ్ కామెంట్లను పెద్దగా పట్టించుకోరు. ఈషా కూడా మొదట్లో వీటిని విస్మరించి వదిలేశారు. కానీ, ఆ వ్యక్తి రోజురోజుకూ తన పరిధి దాటి, అత్యంత హేయమైన రీతిలో కామెంట్స్ చేస్తుండటంతో అది తన గౌరవానికి భంగం కలిగిస్తుందని ఆమె భావించారు. తనను వేధిస్తున్నది ఒక ఫేక్ అకౌంట్ అని తెలిసినప్పటికీ, చట్టపరంగా సమాధానం చెప్పాలని ఆమె నిర్ణయించుకున్నారు. తన గౌరవానికి భంగం కలిగిస్తున్న సదరు వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఈషా రెబ్బ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేవలం ఫిర్యాదు చేయడమే కాకుండా, సదరు వ్యక్తి ప్రొఫైల్ ఐడీతో పాటు, అతను పెట్టిన అభ్యంతరకర కామెంట్లను స్క్రీన్ షాట్స్ తీసి పక్కా ఆధారాలుగా పోలీసులకు సమర్పించారు.





## వారణాసి విని భయపడ్డా: మహేష్

ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మహేష్ బాబు 'వారణాసి' సినిమాపై ఆసక్తికర విషయాలను వెల్లడించారు. వారణాసి కథను మొదటిసారి విన్నప్పుడు ఈ పాత్రను నేను చేయగలనా లేదా అనే సందేహం వచ్చింది. కొంత భయం కూడా వేసింది. కానీ రాజమౌళి కథను లోతుగా వివరించాక ఆ భయాలన్నీ పోయాయి అని తెలిపాడు. ఈ సినిమాలో తన పాత్రకు హుందాతనం చాలా కీలకమని, ముఖ్యంగా శ్రీరాముడిగా కనిపించే సందర్భాల్లో శరీర భాష, నిలబడి మాట్లాడే తీరు వంటి ప్రతి అంశంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామని చెప్పారు. పాత్రలోకి పూర్తిగా వెళ్లేందుకు దాదాపు ఏడాది పాటు శిక్షణ తీసుకున్నానని, ఇందులో భాగంగా 2--3 నెలలు కలరీ వంటి యుద్ధవిద్యను కూడా నేర్చుకున్నానని ఆయన వెల్లడించారు. అంతేకాదు, రాజమౌళి సూచన మేరకు తన రన్నింగ్ స్టైల్‌ను మార్చుకోవాల్సి వచ్చిందని, కేవలం రెండు నిమిషాల షాట్ కోసం ఆరు నెలల పాటు కఠినమైన ట్రైనింగ్ తీసుకున్నానని చెప్పారు. 6 నెలల ట్రైనింగ్ తర్వాత.. ఆ షాట్‌ను స్క్రీన్‌పై చూసినప్పుడు తనకు ఎంతో సంతోషం కలిగిందని.. ఆ ఒక్క షాట్ కోసం ఆరు నెలలు చేసిన శిక్షణ నిజంగా విలువైనదిగా అనిపించిందంటూ ఎమోషనల్ అయ్యారు. అంతేకాకుండా తన నడక మారింది.. నిలబడే విధానం మారింది.. అన్నీ మారిపోయాయి అని పేర్కొన్నాడు.

## గ్లోబల్ బ్యూటీస్ జాబితాలో కృతిసనన్

ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన అందగత్తెల జాబితాలో మొదటి స్థానంలో హాలీవుడ్ సెన్సేషన్ మార్గోట్ రోబీ నిలవగా, షైలీన్ వుడ్లీ, డిల్రాబా దిల్‌మురాత్ వంటి అంతర్జాతీయ నటీమణులు వరుస స్థానాల్లో ఉన్నారు. అయితే, ఈ జాబితాలో 5వ స్థానాన్ని దక్కించుకుని మన ఇండియన్ సినిమా సత్తాను చాటింది కృతి సనన్. ఈమెతో పాటు నాన్సీ మెక్‌డోనీ, హానియా అమీర్, అనా డి అర్మాస్, ఎమ్మా వాట్సన్, అంబర్ హర్డ్ మరియు హండే ఎర్చెల్ వంటి ప్రపంచ ప్రసిద్ధ సుందరీమణులు ఈ టాప్–10లో చోటు సంపాదించారు. అత్యంత కఠినమైన పోటీని తట్టుకుని కృతి ఈ స్థానాన్ని గెలుచుకోవడం ఆమె ఫ్యాన్స్‌కు పండగే అని చెప్పాలి.




# ఫైనల్‌కు కుర్రాళ్లు

## శతక్కొట్టిన హైదరాబాదీ ఆరోన్

### అదరగొట్టిన భారత్-అండర్ 19.. ఫైనల్‌లో ఇంగ్లండ్‌తో టైటిల్ పోరు

అండర్ 19 వరల్డ్ కప్ 2026 టోర్నీలో భారత జట్టు ఫైనల్ చేరింది. అఫ్గానిస్థాన్‌తో బుధవారం జరిగిన సెమీఫైనల్లో ఆయుష్ మాత్రే సారథ్యంలోని భారత జట్టు 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ విజయంతో ఓటమెరుగని జట్టుగా భారత్ టైటిల్ పోరుకు అర్హత సాధించింది. హైదరాబాద్ కుర్రాడు ఆరోన్ జార్జ్(104 బంతుల్లో 15 ఫోర్లు, 2 సిక్స్‌లతో 115) అద్భుత శతకంతో భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు.

అండర్ 19 ప్రపంచకప్ 2026 చరిత్రలోనే అత్యధిక రికార్డ్ ఛేజ్. 311 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో టీమిండియా 41.1 ఓవర్లలో 3 వికెట్లకు 311 పరుగులు చేసి 53 బంతులు మిగిలి ఉండగానే విజయాన్నందుకుంది. ఆరోన్ జార్జ్‌తో పాటు వైభవ్ సూర్యవంశీ(33 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్స్‌లతో 68), ఆయుష్ మాత్రే(59 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లతో 62) హాఫ్ సెంచరీలతో రాణించగా.. విహాన్ మల్హోత్ర(47 బంతుల్లో 3 ఫోర్లతో 38 నాటౌట్) అజేయంగా నిలిచాడు. అఫ్గాన్ బౌలర్లలో ఒమర్జాయ్(2/64) రెండు వికెట్లు తీయగా.. వాహిదుల్లా జద్రాన్ ఒక వికెట్ పడగొట్టాడు. అంతకుముందు అఫ్గానిస్థాన్ నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్లకు 310 పరుగులు చేసింది. ఫైసల్ షినోజాడా(93 బంతుల్లో 15 ఫోర్లతో 110), ఉజైరుల్లా నియాజై(86 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్స్‌లతో 101 నాటౌట్) సెంచరీలతో చెలరేగగా.. ఓపెనర్లు ఉస్మాన్ సదత్(70 బంతుల్లో 3 ఫోర్లతో 39), ఖలిద్ అహ్మద్‌జై(39 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 31) మెరుగైన ఆరంభాన్ని అందించారు. భారత బౌలర్లలో దీపేష్ దేవంద్రెన్(2/64), కాన్షిక్ చౌహన్(2/55) రెండేసి వికెట్లు తీసారు. శుక్రవారం జరిగే ఫైనల్లో ఇంగ్లండ్‌తో భారత్ తలపడనుంది. ఈ టోర్నీలో టీమిండియా ఒక్క మ్యాచ్‌లో కూడా ఓడిపోలేదు. లక్ష్య ఛేదనలో టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ దుమ్మురేపాడు. తనకే సాధ్యమైన ఆటతో అదిరిపోయే ఆరంభాన్ని అందించాడు. 33 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్స్‌లతో 68 పరుగులు చేసి క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. తొలి వికెట్‌కు 90 పరుగుల భాగస్వామ్యాన్ని అందించాడు. క్రీజులో ఉన్నంత సేపు అఫ్గాన్ బౌలర్లకు చెమటలు పట్టించాడు. 22 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద అతను ఇచ్చిన సునాయస క్యాచ్‌ను అఫ్గాన్ ఫీల్డర్ ఉజైరుల్లా నియాజై వదిలేసాడు. ఈ అవకాశాన్ని వైభవ్ సూర్యవంశీ అందిపుచ్చుకున్నాడు. ఆరోన్ జార్జ్ ఇచ్చిన సునాయస క్యాచ్‌ను కూడా అఫ్గాన్ ఫీల్డర్ వదిలేసాడు. వైభవ్ ఔటైనా.. ఆయుష్ మాత్రే, ఆరోన్ జార్జ్ సత్తా చాటారు. 52 బంతుల్లో ఆరోన్ హాఫ్ సెంచరీ సాధించగా.. 43 బంతుల్లో ఆయుష్ మాత్రే అర్ధశతకాన్ని అందుకున్నాడు. 114 పరుగుల భాగస్వామ్యం అనంతరం ఆయుష్ మాత్రే ఔటవ్వగా.. విహాన్ మల్హోత్రతో కలిసి ఆరోన్ జార్జ్ చెలరేగాడు. 95 బంతుల్లో శతకం పూర్తి చేసుకున్న అతను విజయం ముంగిట ఔటయ్యాడు. వేదాంత్ త్రివేది(5) సాయంతో విహాల్ మల్హోత్ర(38 నాటౌట్) భారత విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు.

## పాకిస్థాన్‌ది నీచపు బుద్ధి: అశ్విన్



ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నామని ప్రకటించిన పాకిస్థాన్‌పై టీమిండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. పాకిస్థాన్ నీచపు బుద్ధే వివాదానికి కారణమని తెలిపాడు. నాలుగు రోజుల్లో పాక్ దారికొస్తుందని అభిప్రాయపడ్డాడు. కచ్చితంగా భారత్, పాక్ మ్యాచ్ జరుగుతుందని, ఆ మ్యాచ్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని తెలిపాడు. భద్రతా కారణాల నేపథ్యంలో భారత్‌లో పర్యటించలేమని, తమ మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించాలని బంగ్లాదేశ్ చేసిన విజ్ఞప్తిని ఐసీసీ తోసిపుచ్చింది. దాంతో ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 నుంచి బంగ్లాదేశ్ తప్పుకోగా.. ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్‌కు ఐసీసీ అవకాశం కల్పించింది. అయితే ఈ నిర్ణయాన్ని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తప్పుబట్టింది. బంగ్లాదేశ్‌కు సంఘీభావంగా భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించింది. తాజాగా ఈ వ్యవహారంపై తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన అశ్విన్.. పాకిస్థాన్ తీరును తప్పుబట్టాడు.

## పాకిస్థాన్ అడుక్కు తినే పరిస్థితి: రమీజ్ రాజా



టీ20 వరల్డ్ కప్ 2026 టోర్నీ ఆరంభానికి ముందు భారత జట్టుతో మ్యాచ్‌ని బాయ్‌కాట్ చేస్తున్నట్టు ప్రకటించింది పాకిస్తాన్ క్రికెట్ బోర్డు. దీంతో ఫిబ్రవరి 15న కొలంబో వేదికగా ఇండియా వర్సెస్ పాకిస్తాన్ మధ్య జరగాల్సిన మ్యాచ్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. టీ20 వరల్డ్ కప్ మ్యాచులు ఆడేందుకు పాక్ క్రికెట్ టీమ్‌ని అనుమతించిన పాకిస్తాన్ ప్రభుత్వం, ఇండియాతో మ్యాచ్ మాత్రం బాయ్‌కాట్ చేసింది. ఇప్పటికే ఈ మ్యాచ్‌కి సంబంధించిన టికెట్లు అన్నీ అమ్ముడుపోయాయి. ఈ మ్యాచ్ రద్దు అయితే మొత్తంగా ఐసీసీకి రూ.2300 కోట్ల నష్టం వస్తుందని అంచనా. కేవలం బ్రాడ్‌కాస్టింగ్ రైట్స్ రూపంలోనే ఐసీసీకి భారీగా నిధులు వచ్చాయి. ఇండియా వర్సెస్ పాకిస్తాన్ మ్యాచ్‌పై బోలెడు ఆశలు పెట్టుకుని, ప్రోమోస్ కూడా విడుదల చేసిన జియో హాట్‌స్టార్‌కి భారీ నష్టం కలగనుంది. ఒకవేళ భారత్‌తో మ్యాచ్‌ని బాయ్‌కాట్ చేసిన పాకిస్తాన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఐసీసీ భావిస్తే, ఈ మ్యాచ్ రద్దు వల్ల ఏర్పడిన నష్టాన్ని చెల్లించాల్సిందిగా సూచించే అవకాశం ఉంది. ఇది జరిగితే పీసీబీ దివాళా తీయడం ఖాయం. ఎందుకంటే పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) మొత్తం విలువ రూ.600 కోట్లు మాత్రమే. ఆస్తులన్నీ అమ్ముకున్నా, ఐసీసీకి చెల్లించాల్సిన దాంట్లో సగం కూడా రాదు. ఈ విషయమై పీసీబీ మాజీ చీఫ్ రమీజ్ రాజా, కొన్ని సంచలన వ్యాఖ్యలు చేశాడు. 'పాకిస్తాన్ క్రికెట్ బోర్డు, ఐసీసీ నుంచే నిధులతోనే ప్లేయర్లకు వేతనాలు, ఉద్యోగులకు జీతనాలు చెల్లిస్తోంది. ఐసీసీకి వచ్చే నిధుల్లో 90 శాతం, బీసీసీఐ నుంచే వస్తున్నాయి. ఒకవేళ తమ నిధులను పీసీబీకి వాడకూడదని బీసీసీఐ, ఐసీసీకి ఆదేశిస్తే.. మనం దివాళా తీయడం ఖాయం. మన ప్లేయర్లకు ఇవ్వడానికి చిల్లిగవ్వ కూడా రాదు. అప్పుడు అడుక్కు తినాల్సి వస్తుంది' అని హెచ్చరించాడు.

## దమ్ముంటే పాక్‌ను నిషేధించండి: బాసిత్ అలీ

దమ్ముంటే పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ)పై నిషేధం విధించాలని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసీసీ)కి పాకిస్థాన్ మాజీ క్రికెటర్ బాసిత్ అలీ సవాల్ విసిరాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నామని పాకిస్థాన్ ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో వచ్చిన వార్తలపై బాసిత్ అలీ మండిపడ్డాడు. పీసీబీ తమ నిర్ణయాన్ని మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఐసీసీ హెచ్చరించింది. ఐసీసీ మాట వినకపోతే పాకిస్థాన్‌పై నిషేధం కూడా పడుతుందని వార్తలు వచ్చాయి. ఈ వార్తలను తప్పుబడుతూ బాసిత్ అలీ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఐసీసీకి అంత సీన్ లేదన్నాడు. తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన అతను.. ఐసీసీ వైఖరిని తప్పుబట్టాడు. 'భారత జట్టే ఈ సంప్రదాయాన్ని మొదలు పెట్టింది. పాకిస్థాన్ వేదికగా ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ఆడేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడం లేదని అప్పట్లో బీసీసీఐ చెప్పింది. ఇప్పుడు మా ప్రభుత్వం భారత్‌తో ఆడవద్దని చెబుతోంది. భారత ప్రభుత్వం మాట బీసీసీఐ విన్నప్పుడు.. పాక్ ప్రభుత్వం మాటను పీసీబీ వినకూడదా? వాళ్లు చేస్తే ఒప్పు.. మేం చేస్తే తప్పా?' అని ప్రశ్నించాడు.



## గంభీర్‌కు ధోనీ చురకలు!

ఐసీసీ వన్డే ప్రపంచకప్ 2027లో టీమిండియా మాజీ కెప్టెన్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆడుతారా? అనే ప్రశ్నకు మహేంద్ర సింగ్ ధోనీ ఆసక్తికర సమాధానం చెప్పాడు. ఫిట్‌నెస్, ఫామ్ ఉంటే వయసుతో సంబంధం లేకుండా అంతర్జాతీయ క్రికెట్‌లో కొనసాగవచ్చని అభిప్రాయపడ్డాడు. వయసు కేవలం సంఖ్య మాత్రమేనని, 35 ఏళ్ల వ్యక్తి 22 ఏళ్ల కుర్రాడి కంటే ఫిట్‌గా ఉంటే అతనే జట్టుకు అర్హుడని అభిప్రాయపడ్డాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు కూడా ఫిట్‌గా ఉండి, ఫామ్‌లో ఉంటే వన్డే ప్రపంచకప్ 2027 ఆడుతారని బదులిచ్చాడు. వయసును కాకుండా ఫామ్, ఫిట్‌నెస్‌ను పరిగణలోకి తీసుకోవాలని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు పరోక్షంగా చురకలంటించాడు. 'రోహిత్, కోహ్లీ వన్డే ప్రపంచకప్ 2027లో ఎందుకు ఆడకూడదు? నా దృష్టిలో వయసు కొలమానం కాదు. ప్రదర్శన, ఫిట్‌నెస్ మాత్రమే జట్టులో కొనసాగాలా? వద్దా? అనేదానికి ప్రమాణాలు. అందుకే ఎవరికీ ఎమి చెప్పాల్సిన అవసరం లేదని నేను భావిస్తాను. కానీ ఒక విషయం మాత్రం స్పష్టంగా ఉండాలి. జట్టులో అందరినీ ఒకేలా చూడాలి. నేను అరంగేట్రం చేసినప్పుడు నాకు 24 ఏళ్లు. ఆ సమయంలో ఎవరూ వచ్చి నాకు ఏం చెప్పలేదు. కాబట్టి ఇప్పుడు నేను భారత్ తరఫున ఏడాది ఆడినా... మరో పదేళ్లు, 20 ఏళ్లు ఆడినా.. నా వయసు గుర్తు చేయాల్సిన అవసరం లేదు. వయసు ఏమాత్రం కొలమానం కాదు. ఫిట్‌నెస్ అత్యంత ముఖ్యం. 22 ఏళ్ల కుర్రాడు కూడా ఫిట్‌గా లేకపోతే జట్టుకు అనవసరం. విరాట్ కోహ్లీ లేదా భవిష్యత్తులో వచ్చే ఇతర ఆటగాళ్ల గురించి మాట్లాడితే.. ఒకరికి 30 ఏళ్లు దాటాయి కాబట్టి వారు తదుపరి ప్రపంచకప్ ఆడగలరా? లేదా? అనే నిర్ణయించాల్సింది మనం కాదు. అది వారి వ్యక్తిగత నిర్ణయం. వారు ఫిట్‌గా ఉండి నిలకడగా రాణిస్తూ.. దేశంలో కోసం ఆడాలనే పట్టుదలతో ఉంటే.. వారిని ఎందుకు పక్కనపెట్టాలి' అని వ్యాఖ్యానించాడు.

## ఇషాన్.. 6,1,6,6,4,6

టీమిండియా విధ్వంసకర బ్యాటర్ ఇషాన్ కిషన్ దుమ్మురేపాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 నేపథ్యంలో సౌతాఫ్రికాతో ముంబై వేదికగా జరుగుతున్న వార్మప్ మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. 20 బంతుల్లోనే 53 రన్స్ చేశాడు. న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లో అద్వితీయమైన ప్రదర్శన కనబర్చిన ఇషాన్ కిషన్ అదే జోరును కొనసాగించాడు. ఓపెనర్‌గా ప్రమోషన్ అందుకొని వామప్ మ్యాచ్‌లో సత్తా చాటాడు. సహచర ఓపెనర్ అభిషేక్ శర్మతో కలిసి ఒకే ఓవర్లో 29 పరుగులు చేశాడు. అన్రిచ్ నోకియా వేసిన ఐదో ఓవర్ తొలి బంతికి అభిషేక్ సిక్స్ కొట్టి రెండో బంతికి సింగిల్ తీసుకున్నాడు. ఆ తర్వాత ఇషాన్ కిషన్ వరుసగా 6, 6, 4, 6 బాదాడు. 7 సిక్సులు, 2 ఫోర్లతో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకొని రిటైర్డ్ ఔట్‌గా పెవిలియన్ చేరాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో ఇషాన్ కిషన్ టీమిండియా ఓపెనర్‌గా బరిలోకి దిగుతాడని ఈ మ్యాచ్ ద్వారా టీమ్ మేనేజ్‌మెంట్ హింట్ ఇచ్చింది. ఈ మ్యాచ్‌లో భారత బ్యాటర్లకు అదిరిపోయే బ్యాటింగ్ ప్రాక్టీస్ లభించింది. ఇషాన్ కిషన్‌తో పాటు అభిషేక్ శర్మ(18 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 24) రిటైర్డ్ ఔటవ్వగా.. గాయం నుంచి కోలుకొని జట్టులోకి వచ్చిన తిలక్ వర్మ(19 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 45) తృటిలో హాఫ్ సెంచరీ చేజార్చుకున్నాడు. సూర్యకుమార్ యాదవ్(16 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 30) తన జోరు కొనసాగించగా.. అక్షర్ పటేల్(23 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 35 నాటౌట్) దూకుడుగా ఆడాడు. ధాటిగా ఆడే క్రమంలో రింకూ సింగ్(13బంతుల్లో ఫోర్, సిక్స్‌తో 16), ఔటవ్వగా.. హార్దిక్ పాండ్యా(10 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 30) చెలరేగాడు. దాంతో ఈ మ్యాచ్‌లో భారత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 240 పరుగులు చేసింది. భారత బ్యాటర్ల ధాటికి సౌతాఫ్రికా బౌలర్లు పోటాపడి పరుగులు సమర్పించుకున్నారు. మార్కో జాన్సెన్, కార్బిన్ బోష్, అన్రిచ్ నోర్జ్, మఫకా తలో వికెట్ తీసారు.



ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
www.evarthalu.com
నేటి ఈవార్తలు
గురువారం 5-2-2026

# పొలిటికల్ గిమ్మిక్కులు!

తెలుగు రాష్ట్రాల్లో రాజకీయం ఇప్పుడు ఒక వింత పోకడను సంతరించుకుంది. ప్రజాస్వామ్యంలో ప్రజల సమస్యలే అజెండాగా సాగాల్సిన పాలన, ఇప్పుడు కేవలం భావోద్వేగాలు, వ్యక్తిగత దూషణలు, రాజకీయ వినోదం చుట్టూ తిరుగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో పవిత్రమైన 'లడ్డూ' రాజకీయం ముదిరి పాకాన పడుతుంటే, తెలంగాణలో అధికార పీఠంపై ఉన్న ముఖ్యమంత్రి భాషా ప్రయోగం, మున్సిపల్ ఎన్నికల వ్యూహాలు ప్రజలను విస్మయానికి గురిచేస్తున్నాయి.



అభివృద్ధి మంత్రం పక్కకు పోయి.. కేవలం 'మైలేజ్' కోసం సాగుతున్న ఈ పరిణామాలు ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు. ఏపీలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజలు ఆశించిన మార్పు వేరు, కనిపిస్తున్న దృశ్యం వేరు. తిరుమల లడ్డూ కల్తీ అంశం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. భక్తుల మనోభావాలను గౌరవించడం, తప్పు జరిగినట్లు తేలితే నిగ్గుతేల్చడం ప్రభుత్వ బాధ్యత. కానీ, ఇది కాస్తా పూర్తిస్థాయి రాజకీయ ప్రహసనంగా మారిపోయింది. సిట్ దర్యాప్తు సాగుతున్న తరుణంలోనే, నేతల మధ్య సాగుతున్న మాటల యుద్ధం ప్రజలను విసిగిస్తోంది. ఎన్నికల ముందు ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలు ఎప్పుడు అమలవుతాయి? నిరుద్యోగ భృతి ఏది? ధరల నియంత్రణ ఎక్కడ? అన్న ప్రశ్నలకు సమాధానం దొరకడం లేదు. చర్చంతా లడ్డూ చుట్టూ తిప్పడం ద్వారా అసలైన పాలనా వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించే ప్రయత్నం జరుగుతోందన్న వాదన బలంగా వినిపిస్తోంది. ఇక తెలంగాణలో పరిస్థితి మరీ విచిత్రంగా ఉంది. ప్రజా క్షేత్రంలో పోరాడి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి హోదాలో ఉన్నా ఇంకా ప్రతిపక్ష నేతలాగే వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా ఆయన వాడే భాష, ప్రత్యర్థులపై చేసే వ్యాఖ్యలు అటు రాజకీయ వర్గాల్లో, ఇటు సామాన్య జనంలో చర్చనీయాంశమవుతున్నాయి. తెలంగాణలో త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న హడావుడి అంతా ఇంతా కాదు. క్షేత్రస్థాయిలో డ్రైనేజీలు, రోడ్లు, తాగునీరు వంటి మౌలిక వసతుల కల్పన కంటే, మైకుల ముందు చేసే గంభీరమైన ప్రసంగాలు, సినిమాటిక్ డైలాగులకే రేవంత్ ప్రాధాన్యం ఇస్తున్నారు. రాజకీయాలను ఒక గంభీరమైన చర్చగా కాకుండా, ప్రజలను ఎంటర్‌టైన్ చేసే ఒక షోలా మార్చేశారు. 'నేను వస్తే ఇలా ఉంటుంది.. అది చేస్తే అలా ఉంటుంది' అనే అతిశయోక్తులతో కాలం వెళ్లదీస్తున్నారు తప్ప, హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చడం మినహా చేసిందేమిటన్న ప్రశ్న ఎదురవుతోంది. రెండు రాష్ట్రాల్లోనూ సామాన్యుడు ఎదుర్కొంటున్న సమస్యలు కొండంత. నోటిఫికేషన్ల ఊసే లేదు. నిరుద్యోగులు రోడ్లపైకి వస్తే లాఠీచార్జీలే సమాధానం అవుతున్నాయి. అప్పుల కుప్పలో రాష్ట్రాలు ఉన్నా, ప్రచార ఆర్భాటాలకు మాత్రం నిధుల కొరత లేదు. అటు ఏపీలో గిట్టుబాటు ధర లేదు, ఇటు తెలంగాణలో రుణమాఫీ అమలులో గందరగోళం నెలకొంది. ఓట్లు వేసి గెలిపించిన ప్రజలు ఇప్పుడు తమ సమస్యల పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నారు. రాజకీయ నేతలు లడ్డూల మీద, నోటి దురుసు వ్యాఖ్యలను పక్కనబెట్టి.. క్షేత్రస్థాయిలో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై దృష్టి సారించాలి. లేదంటే, ఈ రాజకీయ వినోదాన్ని చూస్తున్న ప్రజలే రేపు సరైన సమయంలో సినిమా చూపిస్తారు.

**- ఈవార్తలు సంపాదకీయ విభాగం**



# సైలెంట్‌గా.. వాయిలెంట్‌గా!

నేటి అంతర్జాతీయ రాజకీయాల్లో 'వ్యాపారం' అనేది కేవలం లాభనష్టాల బేరీజు మాత్రమే కాదు, అది ఒక శక్తివంతమైన దౌత్య అస్త్రం. భారత్-అమెరికా వాణిజ్య సంబంధాల విషయంలో ఇదే ఇప్పుడు స్పష్టమవుతోంది. ముఖ్యంగా ప్రధాని మోదీ సారథ్యంలో భారత్, యూరోపియన్ యూనియన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అగ్రరాజ్యం అమెరికాను, ముఖ్యంగా 'అమెరికా ఫస్ట్' అనే నినాదంతో ముందుకు సాగే డొనాల్డ్ ట్రంప్‌ను ఆలోచనలో పడేశాయి. ట్రంప్ గతంలో భారత్‌పై సుంకాల విషయంలో కఠినంగా వ్యవహరించారు. అయితే ఈయూతో భారత్ డీల్ కుదరడంతో, అమెరికా పట్టు కోల్పోతుందేమోనన్న భయం ట్రంప్‌లో మొదలైంది.

భారత్ టారిఫ్ కింగ్ అంటూ విమర్శలు గుప్పించిన ట్రంప్, భారత్ ఈయూ వైపు మొగ్గు చూపడం గమనించి తన పంథాను మార్చుకోక తప్పలేదు. భారత్‌ను విస్మరిస్తే అమెరికా కంపెనీలు భారీ నష్టాన్ని చవిచూస్తాయని, ముఖ్యంగా ఐరోపా దేశాలు భారత మార్కెట్‌ను ఆక్రమిస్తాయని గ్రహించారు. ఈ భయం లేదా ముందస్తు జాగ్రత్తే భారత్‌తో వాణిజ్య ఒప్పందాల విషయంలో ట్రంప్‌ను మెత్తబడేలా చేసింది. గతంలో కఠినంగా వ్యవహరించిన ట్రంప్, భారత్‌తో స్నేహం కోసం తాపత్రయపడటం వెనుక మోదీ అనుసరించిన 'బహుళ పక్ష దౌత్యం' ఉంది. మోదీ-ఈయూ డీల్ ఒక హెచ్చరికగా పనిచేసింది. ఫలితంగా అమెరికా భారత్‌కు రక్షణ, సాంకేతిక, వాణిజ్య రంగాల్లో ప్రాధాన్యం ఇవ్వడం ప్రారంభించింది. ఇది కేవలం ఒక వ్యాపార ఒప్పందం కాదు, ప్రపంచ వేదికపై భారత్ తన బలాన్ని నిరూపించుకున్న సందర్భం. ఏ అగ్రరాజ్యానికైనా భారత్ అవసరం ఎంత ఉందో ఈ పరిణామాలు నిరూపిస్తున్నాయి.

**- విశ్వతేజ మున్నూరి, హైదరాబాద్**

# పాక్-బంగ్లా క్రికెట్ నాశనమే!

క్రికెట్ అనేది కేవలం ఒక ఆట మాత్రమే కాదు.. అది దేశాల మధ్య వారధి. కానీ, దురదృష్టవశాత్తూ నేడు ఆ వారధిని కూల్చేందుకు కొన్ని దేశాల క్రికెట్ బోర్డులు ప్రయత్నిస్తున్నాయి. రాబోయే టీ20 వరల్డ్ కప్‌లో పాల్గొనబోమంటూ పాకిస్థాన్ క్రికెట్ బోర్డు, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అనుసరిస్తున్న మొండి వైఖరి అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ అస్తిత్వానికే సవాలు విసురుతోంది. పాకిస్థాన్ ఎప్పుడూ 'విక్టిమ్ కార్డ్' ప్లే చేయడంలో సిద్ధహస్తురాలు. భారత్‌లో జరిగే టోర్నీలైనా, లేదా భారత్ ఆడే టోర్నీలైనా సరే.. ఏదో ఒక భద్రతా సాకును ముందుకు తెచ్చి రగడ సృష్టించడం ఆ దేశానికి అలవాటుగా మారింది. తాజాగా టీ20 వరల్డ్ కప్‌పై వారు చేస్తున్న వ్యాఖ్యలు కేవలం బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాలే తప్ప మరొకటి కాదు. మరోవైపు బంగ్లాదేశ్ తీరు కూడా ఆశ్చర్యకరంగా ఉంది.







ఆసియా ఉపఖండంలో క్రికెట్ అభివృద్ధికి భారత్ అందిస్తున్న సహకారాన్ని విస్మరించి, పాక్ గొంతులో గొంతు కలపడం వారి ద్వంద్వ నీతిని చాటుతోంది. క్రీడలను రాజకీయాలకు దూరంగా ఉంచాలనే ప్రాథమిక సూత్రాన్ని ఈ రెండు దేశాలు కాలరాస్తున్నాయి. ఇటువంటి మొండి వైఖరిని ప్రదర్శించే బోర్డులపై ఐసీసీ కఠినంగా వ్యవహరించకపోవడం వల్లే వారు పదే పదే ఇలాంటి ప్రకటనలు చేయగలుగుతున్నారు. కోట్ల మంది క్రికెట్ ప్రేమికులు ప్రపంచకప్ కోసం ఎదురుచూస్తుంటే, బోర్డుల అంతర్గత పట్టింపుల వల్ల ఆటగాళ్లను దూరం చేయడం అభిమానులకు చేసే ద్రోహమే. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఆదాయంలో మెజారిటీ వాటా ఐసీసీ ద్వారానే వస్తుంది. ఐసీసీకి వచ్చే ఆదాయంలో సింహభాగం భారత్ నుంచే వెళ్తుంది. అంటే, పరోక్షంగా భారత మార్కెట్ వల్ల లబ్ధి పొందుతూ, అదే భారత్ వేదికగా లేదా భారత్‌తో ఆడే విషయంలో అభ్యంతరాలు చెప్పడం హాస్యాస్పదం. 'ఆట గెలవాలి.. కానీ ఇక్కడ అహంకారం గెలుస్తోంది. దేశాల మధ్య సరిహద్దు గొడవలు ఉండవచ్చు, కానీ మైదానంలో ఆటగాళ్లు మాత్రమే ఉండాలి, సైనికులు కాదు' ఒకవేళ ఏ దేశమైనా వరల్డ్ కప్ వంటి మెగా టోర్నీని బహిష్కరిస్తే, వారిపై కనీసం ఐదేళ్ల పాటు నిషేధం విధించాలి. ఐసీసీ ఇచ్చే నిధుల్లో భారీగా కోత విధించి, ఆ దేశాల బోర్డులకు తగిన గుణపాఠం చెప్పాలి. ప్రతిసారి పాక్ అడిగినట్లు తటస్థ వేదికలు ఏర్పాటు చేయడం మానుకోవాలి. టోర్నీ ఎక్కడ జరిగితే అక్కడికి వచ్చి ఆడటం నిబంధనగా మారాలి. క్రికెట్ అనేది ఒక సమున్నతమైన క్రీడ. దానిని పాకిస్థాన్, బంగ్లాదేశ్ బోర్డులు తమ స్వార్థ రాజకీయాల కోసం వాడుకోవడం ఆపాలి. వరల్డ్ కప్‌లో ఆడబోమని చెప్పడం అంటే.. ప్రపంచ క్రికెట్ నుంచి తామే తప్పుకుంటున్నామని ప్రకటించడమే. ఈ రెండు దేశాల క్రికెట్ బోర్డులపై కఠిన వైఖరి అవలంబిస్తేనే క్రికెట్‌కు మంచిది. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఆర్థికంగా ఎంత బలహీనంగా ఉందో ప్రపంచమంతటికీ తెలుసు. ఐసీసీ ఇచ్చే రెవెన్యూ వాటా మీదనే ఆ దేశ క్రికెట్ మనుగడ సాగుతోంది. ఐసీసీకి వచ్చే ఆదాయంలో 70-80 శాతం భారత మార్కెట్ నుంచే వస్తుంది. భారత్ ఆడే టోర్నీలను, భారత్ వేదికగా జరిగే ఈవెంట్లను బహిష్కరిస్తామనడం అంటే.. తమకు అన్నం పెట్టే పళ్లెంలో మట్టి పోసుకోవడమే. ఐసీసీ గనుక కఠినంగా వ్యవహరించి ఫండ్స్ నిలిపివేస్తే, పాక్ క్రికెట్ బోర్డు తలుపులు మూసుకోవడానికి ఎంతో కాలం పట్టదు. ఇక, ఒకప్పుడు బంగ్లాదేశ్ క్రికెట్ అంటే ఒక పోరాట పటిమ ఉండేది. కానీ నేడు ఆ బోర్డు పాకిస్థాన్ అడుగుజాడల్లో నడుస్తూ తన స్వతంత్రతను కోల్పోయింది. అంతర్జాతీయ వేదికలపై మాట తప్పడం, భద్రతా కారణాలను సాకులుగా చూపడం వల్ల ఇతర దేశాలు ఈ బోర్డులతో ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడేందుకు భయపడే పరిస్థితి వస్తుంది. ఈ రెండు బోర్డుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత ఐసీసీపై ఉంది. "ఆడతామంటే ఆడండి.. లేదంటే తప్పుకోండి" అని కఠినంగా చెప్పాల్సిన సమయం వచ్చింది. ఒక జట్టు లేనంత మాత్రాన వరల్డ్ కప్ ఆగిపోదు, కానీ ఆ టోర్నీ లేకపోతే ఈ బోర్డులు కుప్పకూలిపోతాయి. అహంకారం తలకెక్కిన బోర్డులకు ఆర్థికపరమైన ఆంక్షలే సరైన మందు.

**- రణధీర్ గుండు**

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.